

# విభారే
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి గురువారం 10 మార్చి 2022 సంపుటి: 03 సంచిక: 182 పేజీలు: 4 వెల: రూ 3-00


# ప్రతి మండలానికి రెండు జూనియర్ కళాశాలలు: సీఎం జగన్



అమరావతి: విద్యాశాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సమిక్ష చేపట్టారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతన విద్యావిధానం కింద తీసుకున్న నిర్ణయాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, ఆరు కేటిగిరీల కింద స్కూళ్ల ఏర్పాటు, మ్యాపింగ్, సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు, ఇంగ్లిషు బోధన, డిజిటల్ లెర్నింగ్, మండలానికి రెండు జూనియర్ కళాశాలల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. విద్యాశాఖలో తీసుకున్న నిర్ణయాలు వాటి అమలు తీరును సీఎం జగన్‌కు అధికారులు వివరించారు. నూతన విద్యావిధానానికి అనుగుణంగా ఇప్పటివరకు మ్యాపింగ్ కాకుండా మిగిలిన స్కూళ్లను కూడా మ్యాపింగ్ చేశామని తెలిపారు. ఫిబ్రవరి 14 నుంచి ప్రతిరోజూ ఒక ఇంగ్లిషు పదాన్ని నేర్పేలా విద్యార్థులకు బోధిస్తున్నట్లు చెప్పారు. అయితే వచ్చే ఏడాది 8వ తరగతి నుంచి డిజిటల్ లెర్నింగ్, ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని పెంచేలా తగిన చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ప్రతి మండలానికి ఒక కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల, ఒక మహిళా జూనియర్ కళాశాల ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూనియర్ కళాశాలలు లేని మండలాల గుర్తించాలని తెలిపారు. స్కూళ్లు, వసతులు తదితర అంశాలపై ఫిర్యాదుల స్వీకరణకు టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని, ఎస్‌సీఈఆర్‌టీ సిఫార్సుల అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


చదవండి: గెలిచింది మేమే.. బుర్ర పనిచేయడం లేదా?: కొడాలి నాని


సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

ప్రభుత్వ స్కూళ్లలో ఉన్నత చదువులు చదువుకున్న టీచర్లు ఉన్నారు.

వారి సేవలను సమర్థవంతంగా వాడుకోగలిగితే... నాణ్యమైన విద్య అందుతుంది.

అందుకనే విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకు వచ్చాం.

మంచి చదువులు చదువుకున్న టీచర్ల సేవలను వాడుకునేందుకు విధానాలు రూపొందించాం.

సబ్జెక్టుల వారీగా టీచర్లను అందుబాటులోకి తీసుకు వస్తున్నాం.

టీచర్ల సేవలను బోధనేతర కార్యక్రమాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ వాడుకోకూడదు.

దీనివల్ల విద్యార్థుల చదువులు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.

టీచర్లు పూర్తిగా విద్యార్థుల చదువులకు అందుబాటులో ఉండేలా చూడాలి.

దీంట్లో భాగంగానే బోధనేతర కార్యక్రమాల్లో వారిని వినియోగించకుండా చూడాలి.

ప్రతిరోజూ ఒక పదాన్ని నేర్పేటప్పుడు డిక్షనరీలో దాన్ని చూసి అర్థం తెలుసుకోవడంతో పాటు, వాక్యంలో ఎలా ఉపయోగించాలో కూడా నేర్పాలి.

మొదటిరోజు పదం చెప్పడం, అసైన్‌మెంట్ ఇచ్చి రెండో రోజు దాన్ని ఉపయోగించడం నేర్పించాలి.


చదవండి: సీఎం జగన్ చేతుల మీదగా బీఫాం అందుకున్న రుహుల్లా


లెర్నింగ్ టు లెర్న్ కాన్సెప్ట్‌లోకి తీసుకెళ్లాలి.

కొత్తగా ఏర్పడనున్న 26 జిల్లాల్లో కూడా ఉపాధ్యాయశిక్షణ కేంద్రాలు ఉండాలి.

ప్రస్తుతం ఉన్న శిక్షణా కేంద్రాలలో నాడు ? నేడు కింద సౌకర్యాలను మెరుగుపరచాలి

స్కూళ్లలో హెడ్ మాస్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలి.

విద్యార్థులకు కెరీర్‌గైడెన్స్ ఇవ్వాలి.

తల్లిదండ్రులతో మంచి సంబంధాలు నెరుపుతూ విద్యార్థుల భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసేలా హెడ్‌మాస్టర్లు ఉండాలి.

ప్రతి విద్యార్థినీ, వారి తల్లిదండ్రులనూ విడివిడిగా కలుస్తూ.. వారి భవిష్యత్తుకు మంచి మార్గం వేసేలా కౌన్సిలింగ్ ఇవ్వాలి.


స్కూళ్లలో నాడు ? నేడు కింద ఏర్పాటుచేసుకున్న సౌకర్యాల నిర్వహణ బాగుండాలి. లేకపోతే నిరర్థకమవుతాయి.

టాయిలెట్లు, తాగునీటి ప్లాంట్ల నిర్వహణ బాగుండాలి.

ఎప్పుడు సమస్య వచ్చినా వెంటనే దాన్ని పరిష్కరించి, సమర్థవంతంగా నిర్వహించాలి.

ఫిర్యాదు వచ్చిన వారం రోజుల్లోగా పరిష్కారం కావాలి.

గ్రామ, వార్డు సచివాలయాల్లోని టెక్నికల్, ఇంజినీరింగ్ సిబ్బంది, విలేజ్ క్లినిక్స్‌లో సిబ్బందికి స్కూళ్లలో వసతుల నిర్వహణపై తగిన



ఎస్‌ఓపీలను ఇవ్వాలి.

మార్చి 15 నుంచి స్కూళ్లలో నాడు ? నేడు రెండోవిడత మొదలుపెట్టాలి.

స్కూళ్లలో ప్లే గ్రౌండ్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.

దీనికి సంబంధించి మ్యాపింగ్ చేసి... ప్రణాళిక సిద్ధంచేయాలి.

స్కూళ్లు తెరిచే నాటికి పిల్లలకు విద్యాకానుక అందించాలి.

ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సీఎస్ డాక్టర్ సమీర్ శర్మ, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధానకార్యదర్శి కేవీస్ జవహర్ రెడ్డి, పాఠశాల విద్యాశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, ముఖ్యమంత్రి కార్యదర్శి సాలోమన్ ఆరోకియా రాజ్, అదనపు కార్యదర్శి ఆర్ ముత్యాలరాజు, ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్, పాఠశాల విద్యాశాఖ సలహాదారు ఏ మురళీ, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్(ఎస్‌సీఈఆర్‌టి) బి ప్రతాప్ రెడ్డి, సీఎం సీపీఆర్వో పూడి శ్రీహరి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# 14 నుంచి పార్లమెంట్.. ఒకే సమయంలో ఉభయ సభలు



న్యూఢిల్లీ : ఈ నెల 14వ తేదీ నుంచి పార్లమెంట్ బడ్జెట్ రెండో విడుత సమావేశాలు ప్రారంభం కానున్నాయి. లోక్‌సభ, రాజ్యసభ ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నాయి. కరోనా థర్డ్ వేవ్ నేపథ్యంలో ఉభయ సభలు రెండు విడుతల్లో మొదట షిఫ్టులో రాజ్యసభ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, రెండో షిఫ్టులో సాయంత్రం 4 గంటల నంచి రాత్రి 9 గంటల వరకు లోక్‌సభ సమావేశమైన విషయం తెలిసిందే. ప్రస్తుతం దేశంలో కరోనా కేసులు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఒకే సమయంలో ఉభయ సభలు భేటీకానున్నాయి. తొలి విడుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ ఏడాది జనవరి 31న ప్రారంభమై.. ఫిబ్రవరి 11వ తేదీ వరకు కొనసాగాయి. పార్లమెంట్ సమావేశాల తొలి రోజున రాష్ట్రపతి ప్రసంగం చేయగా.. ఆ తర్వాత ఆర్థిక సర్వేను మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌కు సమర్పించారు. ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

# గెలిచింది మేమే.. బుర్ర పనిచేయడం లేదా?: కొడాలి నాని

కృష్ణా: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిపై ఏపీ మంత్రి కొడాలి నాని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబుకు శవరాజకీయాలు చేయడం పుట్టుకతో వచ్చాయని మండిపడ్డారు. ఎవడు చచ్చిపోతాడా.. వాళ్ల శవం దగ్గరకు పోయి రాజకీయం చేద్దామా అని ఎదురుచూస్తాడని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు శిక్ష విధించినా చంద్రబాబుకు సిగ్గురావడం లేదని దుయ్యబట్టారు. మహిళా దినోత్సవాన్ని కూడా రాజకీయ సభలా విమర్శిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానసికంగా దెబ్బతిన్న చంద్రబాబుకు మైండ్ చెడిపోయిందని, అసెంబ్లీకి రాకుండా ఇంటిదగ్గర కూర్చున్నాడని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ముఖ్యమంత్రి స్థానంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి ఓర్వలేకపోతున్నాడని విమర్శించారు. అందుకే సంబంధం లేని అంశాలన్నింటినీ జగన్‌పై రుద్దాలని చూస్తున్నారని అన్నారు. వైఎస్ జగన్ చిన్న వయసులో ఉన్నత స్థానానికి వచ్చాడన్న ఇంగిత జ్ఞానం చంద్రబాబుకు లేదని, మానసిక స్పృహకోల్పోయి చంద్రబాబు పిచ్చివాగుడు వాగుతున్నాడని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడైనా ఎన్నికలకు వెళ్లవచ్చని చంద్రబాబు మాట్లాడటంపై కొడాలి నాని మండిపడ్డారు. చంద్రబాబుకు మైండ్ చెడిపోయిందంటూ.. బుర్ర పనిచేయడం లేదని విమర్శించారు. 'రెండున్నరేళ్లలో అన్ని ఎన్నికల్లోనూ గెలిచింది మేమే. సిగ్గులేకుండా కోర్టుకు వెళ్లి 21 మున్సిపాల్టీల ఎన్నికలను అడ్డుకున్నాడు. కోర్టు జడ్జిమెంట్ రాగానే ఎన్నికలు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం. 21 మున్సిపాల్టీల్లో ప్రజల తీర్పేంటో చంద్రబాబు చూస్తాడు.



ఎన్టీఆర్, వంగవీటి రంగా వంటి వారిని ఒక ప్రాంతానికే పరిమితం చేయడం సరికాదు. ఎన్టీఆర్ కేవలం నిమ్మకూరుకు మాత్రమే చెందిన వ్యక్తి కాదు. విజయవాడ కేంద్రంగా ఏర్పడిన జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టారు. అన్ని రకాల సౌలభ్యాలున్న విజయవాడకు ఎన్టీఆర్ పేరు పెడితే తప్పేంటి. విజయవాడ ఏమైనా పక్కదేశంలో ఉందా. జగన్ మోహన్ రెడ్డికి మంచి పేరు రావడం టీడీపీ నేతలు తట్టుకోలేక పోతున్నారు. కావాలనే అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారు.' అని మంత్రి కొడాలి నాని చంద్రబాబుపై విరుచుకుపడ్డారు.

## వైసీపీ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలుపుతారు: విష్ణువర్ధన్‌రెడ్డి

అమరావతి: ఈ ప్రభుత్వాన్ని రైతులే బంగాళాఖాతంలో కలుపుతారని బీజేపీ నేత విష్ణువర్దన్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉద్యమాలను సీఎం జగన్ పోలీసులతో అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. ఉత్సవ విగ్రహంలా మారిన వ్యవసాయ మంత్రి కన్నబాబు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చిన్నచిన్న ప్రాజెక్టులను కూడా ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారు? అని ప్రశ్నించారు. రైతులకు మద్దతుగా బిజెపి ఉద్యమానికి సిద్ధమైతే ప్రభుత్వం పోలీసులతో అడ్డుకుంటుందని ద్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టు కేంద్రం నిర్మిస్తుంటే రాష్ట్రం భజన చేస్తుందని విమర్శించారు.

# ఛాలెంజ్ చేస్తున్నారు కదా..ఎన్నికలకు వెళదాం..: అచ్చెన్న

అమరావతి: ఛాలెంజ్ చేస్తున్నారు కదా..ఎన్నికలకు వెళదామంటూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వైసీపీకి సవాల్ చేశారు. బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలు ఎపుడు వచ్చినా టీడీపీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, ఇంకా వ్యతిరేకత పెరిగితే నష్టం జరుగుతుందని.. అందుకే ముందస్తు ఎన్నికలకు వెళ్లే ఆలోచన చేస్తున్నారని అన్నారు. తోందర్లోనే ఎన్నికలు వస్తాయని ప్రజలు అనుకుంటున్నారని.. మేము కూడా భావిస్తున్నామని అన్నారు. ఈసారి టీడీపీకి 160 సీట్లు వస్తాయన్నారు. గుడ్డిగా చెప్పడం లేదని, రాష్ట్రంలో ఆ పరిస్థితులు ఉన్నాయని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. అమరావతి: ఛాలెంజ్ చేస్తున్నారు కదా..ఎన్నికలకు వెళదామంటూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వైసీపీకి సవాల్ చేశారు. బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలు ఎపుడు వచ్చినా టీడీపీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, ఇంకా వ్యతిరేకత పెరిగితే నష్టం జరుగుతుందని.. అందుకే ముందస్తు ఎన్నికలకు వెళ్లే ఆలోచన చేస్తున్నారని అన్నారు. తోందర్లోనే ఎన్నికలు వస్తాయని ప్రజలు అనుకుంటున్నారని.. మేము కూడా భావిస్తున్నామని అన్నారు. ఈసారి టీడీపీకి 160 సీట్లు వస్తాయన్నారు. గుడ్డిగా చెప్పడం లేదని, రాష్ట్రంలో ఆ పరిస్థితులు ఉన్నాయని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు.




# సీఎం జగన్ చేతుల మీదగా బీఫాం అందుకున్న రుహుల్లా



తాడేపల్లి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎండీ రుహుల్లా బీఫాం తీసుకున్నారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదగా బీంఫాం అందుకున్నారు. ఇటీవల మరణించిన కరీమున్నీసా స్థానంలో ఆమె కుమారుడికి అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, రుహుల్లా తండ్రి మహ్మద్ సలీమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుహుల్లా మీడియాతో మాట్లాడుతూ, మూడు నెలల క్రితం అమ్మ కరీమున్నీసా మరణించారని.. సీఎం వైఎస్ జగన్ పిలిపించి ఈ రోజు బీఫామ్ ఇచ్చారని తెలిపారు. రేపు నామినేషన్ దాఖలు చేస్తున్నానని పేర్కొన్నారు. మైనారి టీలంతా సీఎం జగన్‌కి రుణపడి ఉంటాం`న్నారు. మేమంతా ఆయనకు అండగా ఉండి ఆయన అడుగుజాడల్లో నడుస్తామ న్నారు. తన తల్లి చేసిన అభివృద్ధిని కొనసాగిస్తానని రుహుల్లా అన్నారు.

## రైతు ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు రూరల్: వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో నూతన ఆలోచనలు, ఆవిష్కరణల రూపకర్తలైన అభ్యుదయ రైతులకు ఈ ఏడాది ఉగాది పురస్కారాలను అందించేందుకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. రాష్ట్రం లోని 13 జిల్లాల నుంచి ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ పి.రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రైతులు తమకు సమీపం లోని వ్యవసాయ పరిశోధనా స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలలో దరఖాస్తులు పొందవచ్చు. భర్తీ చేసిన దరఖాస్తులకు ధ్రువపత్రాలను జత చేసి ఈ నెల 16వ తేదీలోగా అందజేయాలన్నారు.

# సంపాదకీయం

గురువారం 10 మార్చి 2022

## కువైట్ నుంచి గంగా వరకు...

యుక్రెయిన్లో ఉన్న భారతీయుల్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో, గతంలో ఇలాంటి యుద్ధ సమయాల్లో ఆయా దేశాల నుంచి భారతీయుల్ని ప్రభుత్వం ఎలా స్వదేశానికి చేర్చింది? ఆ సమయంలో ఎదుర్కొన్న ఇబ్బందులేంటి? వాటిని ఇండియన్ గవర్నమెంట్ ఎలా అధిగమించింది? ఆపరేషన్ గంగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వరకు 73 విమానాల్లో 15,206 మందిని భారత్ తీసుకొచ్చినట్టు పౌర విమానయాన శాఖ ప్రకటించింది. అలాగే 10 ఎయిర్‌ఫోర్స్ విమానాల్లో 2056 మందిని తరలించినట్టు తెలిపింది. సోమవారం 7 విమానాల్లో 1314 మంది భారత్ వచ్చినట్టు వివరించింది. మొత్తంగా ఫిబ్రవరి 22న ఆపరేషన్ గంగ మొదలైనప్పట్నుంచి ఉక్రెయిన్ పొరుగు దేశాల నుంచి 17,400 మందికి పైగా భారతీయులను సొంత దేశానికి తరలించామని వివరించింది. మంగళవారం మరో 2 విమానాలు భారత్ రానున్నాయి. దీంతో, ఆపరేషన్ గంగ దాదాపు చివరి దశకు చేరినట్టు అయ్యింది.. అయితే మరో రెండు వేల మంది వరకు రొమేనియా, స్లొవేకియా, మాల్డోవా దేశాల్లో భారత్ వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని విదేశాంగ శాఖ తెలిపింది.యుక్రెయిన్ యుద్ధం కన్నా ముందు భారత్ 4 సార్లు అంటే 1990లో ఇరాక్ - కువైట్ యుద్ధ సమయంలోనూ, అలాగే 2006లో లెబనాన్ యుద్ధం జరిగినప్పుడు, 2011లో లిబియన్ సివిల్ వార్ సమయంలోనూ, 2015లో యెమెన్ యుద్ధం సమయంలోనూ భారీ ఎత్తున రెస్క్యూ ఆపరేషన్లను నిర్వహించింది.1990, ఆగస్టు 2న ఇరాక్, కువైట్‌ను ముట్టడించింది. ఆ సమయానికి సుమారు 2 లక్షల మంది భారతీయులు కువైట్‌లో నివాసముంటున్నారు. యుద్ధం కారణంగా నెలకొన్న అనిశ్చితి వల్ల వారు తిరిగి స్వదేశానికి వచ్చేందుకే మొగ్గు చూపారు. కువైట్‌లో ఉన్న భారతీయుల అభ్యర్థన మేరకు వారిని స్వదేశానికి తీసుకురావడంలో భాగంగా నాటి విదేశాంగ మంత్రి ఐ.కె.గుజ్రాల్, అప్పటి ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌తో ఆగస్టు 21న భేటి అయ్యారు. ఆపై భారతీయుల్ని సురక్షితంగా కువైట్ నుంచి తీసుకొచ్చేందుకు ఆయన అనుమతి తీసుకున్నారు.అయితే అప్పటికే అమెరికా కువైట్ పరిసరాల్లో ఉన్న సముద్ర మార్గంపై నిషేధం విధించింది. అటు కువైట్, బాగ్దాద్‌లలో విమానాల ల్యాండింగ్ పై నిషేధం విధించింది ఇరాక్.దీంతో భారత్ చాలా తెలివైన వ్యూహాన్ని అనుసరించింది. సుమారు లక్ష ఇరవై వేల మంది భారతీయుల్ని బస్సుల ద్వారా 1120 కిలోమీటర్ల దూరంలో ఉన్న జోర్డాన్‌కు తరలించింది. భారతీయులకు తాత్కాలికంగా వసతి, ఆహార సౌకర్యాలు కల్పించేందుకు జోర్డాన్ అంగీకరించింది. ఆపై భారతీయుల్ని అధికారులు అమ్మన్‌కు తరలించి, అక్కడ నుంచి ముంబైకి సురక్షితంగా విమానాల్లో తీసుకొచ్చారు.ఈ ఆపరేషన్ సుమారు 2 నెలల పాటు నిర్విఘ్నంగా కొనసాగింది. రోజుకు 16 నుంచి 18 గంటల ప్రయాణం. అక్టోబర్ చివరి వరకు సుమారు 448 ట్రిప్స్ వేసింది ఇండియన్ ఎయిర్ లైన్స్. గల్ఫ్ ప్రాంతం నుంచి దాదాపు లక్ష పది వేల మందిని స్వదేశానికి తీసుకొచ్చారు.2006 జులై 12 హెజ్బొల్లా-ఇరాకీ సైన్యానికి మధ్య జరిగిన ఘర్షణలు లెబనాన్ యుద్ధానికి దారి తీశాయి. అప్పటికి లెబనాన్లో సుమారు 10 వేల మంది భారతీయులు నివసిస్తున్నారు. వారిలో సుమారు 2వేల మంది విపత్కర పరిస్థితుల్లో ఉన్నారు. అటు నేపాల్, శ్రీలంక దేశాలు తమ దేశస్థుల్ని కూడా సురక్షితంగా స్వదేశాలకు తీసుకొని రావాలని భారత్‌ను అభ్యర్థించాయి.సరిగ్గా అదే సమయానికి ఇండియన్ నేవీకి చెందిన 54వ టాస్క్ ఫోర్స్ బృందం మధ్యధరా సముద్ర ప్రాంతం నుంచి తిరుగు ప్రయాణంలో ఉంది. ఆ టాస్క్ ఫోర్స్‌లో ఐఎన్ఎస్ ముంబై, ఐఎన్ఎస్ బ్రహ్మపుత్ర, ఐఎన్ఎస్ బెత్వా అలాగే ఫ్లీట్ ట్యాంకర్ ఐఎస్ఎస్ శక్తి ఉన్నాయి. ఆ సమయానికి ఫ్లీట్ సుయిజ్ కెనాల్ సమీపంలో ఉంది. అయితే ఒక్కసారి సూయిజ్ కెనాల్లోకి ప్రవేశిస్తే అక్కడ నుంచి లెబనాన్ వెళ్లేందుకు చాలా సమయం పడుతుంది. దీంతో వెంటనే నౌకలన్నింటికి లెబనాన్ వెళ్లాలని అక్కడ భారతీయుల్ని రక్షించాలని ఆదేశాలు జారీ చేసింది భారత ప్రభుత్వం. అక్కడ నుంచి సైప్రస్ వరకు సముద్ర మార్గంలో తీసుకొచ్చి, అపై సైప్రస్ నుంచి వాయు మార్గంలో తీసుకొని రావాలన్నది భారత్ ప్లాన్. అప్పటికప్పుడు మన ప్రభుత్వం సైప్రస్ ప్రభుత్వంతో చర్చలు జరిపి భారతీయ విమానాలు ల్యాండ్ అయ్యేందుకు అనుమతులు తీసుకొంది.మొత్తంగా 2,280 మందిని కాపాడగా వారిలో 1794 మంది భారతీయులు, 112 మంది శ్రీలంక వాసులు, 64 మంది నేపాలీలు ఉన్నారు. వారిలో భారతీయుల్ని వివాహం చేసుకొన్న లెబనీయులు కూడా ఉన్నారు. వీరితో పాటు మరి కొందర్ని కూడా కాపాడాలంటూ భారత అధికారులకు విజ్ఞప్తులు వెల్లువెత్తడంతో వారిని కూడా సురక్షితంగా తీసుకొచ్చారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత భారతీయ నేవీ ఆధ్వర్యంలో జరిగిన అతి పెద్ద రెస్క్యూ ఆపరేషన్ ఇది.ఉత్తర ఆఫ్రికా దేశమైన లిబియాలో అప్పటి అధ్యక్షుడు గడాఫీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగాయి. 2011 ఫిబ్రవరి 15 నాటికి ఈ ఆందోళనలు సివిల్ వార్‌గా మారాయి.సమయానికి సుమారు 18 వేల మంది భారతీయులు లిబియాలో ఉన్నారు. అప్పటికే ట్రిపోలి ఎయిర్ పోర్ట్‌లో తీవ్రమైన గందరగోళం, అలజడి నెలకొని ఉన్నాయి. మరో అంతర్జాతీయ విమానాశ్రయం బెనీనా రన్ వే అప్పటికే పూర్తిగా ధ్వంసమయ్యింది.లిబియాలో ఉన్న భారతీయుల్ని రక్షించేందుకు ఫిబ్రవరి 26న ఐఎన్ఎస్ మైసూర్, ఐఎన్ఎస్ ఆదిత్య, ఐఎన్ఎస్ జలాశ్వ నౌకల్ని భారత ప్రభుత్వం పంపింది. వాటితో పాటు మరో రెండు కమర్షియల్ నౌకలు స్కోషా ప్రిన్స్, 1600 సీట్ల సామర్థ్యం కల్గిన ల సుపర్బెలను పంపించింది. కేవలం 2 రోజుల్లోనే లిబియాలోని బెంగాజీ నౌకాశ్రయానికి స్కోషా ప్రిన్స్ నౌక చేరుకుంది. బెంగాజీ, ట్రిపోలీ ప్రాంతాల్లో నివాసముంటున్న భారతీయుల్ని అలెగ్జాండ్రియాకు తీసుకొచ్చింది ఈ నౌక. అక్కడ నుంచి వాయు మార్గం ద్వారా వారిని ఇండియాకు తరలించారు.ఎయిర్ పోర్టులో ల్యాండింగ్ అనుమతులు వచ్చిన వెంటనే 500 మంది భారతీయుల్ని స్వదేశానికి తీసుకొచ్చారు. ఆ తర్వాత సభా ఎయిర్ పోర్ట్ నుంచి 1000 మందిని, అలాగే సియరట్ ఎయిర్ పోర్ట్ నుంచి మరో 1000 మందిని భారత్ తీసుకొచ్చారు.మరి కొంత మంది భారతీయులు కాలినడకన ఈజిప్టు సరిహద్దుల్ని చేరుకోగా, అక్కడ భారతీయ అధికారులు వారిని విమానాల ద్వారా ముంబై చేర్చారు. సుమారు 15 వేల మంది భారతీయుల్ని సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చిన అనంతరం మార్చ్ 11న ఈ రెస్క్యూ ఆపరేషన్ ముగిసింది.

# రైతులకు సర్కారీ ఫోన్లు..

విజయవాడ, మార్చి 9,ఇప్పటి వరకూ వేధించారు. రైతులను అవమానించారు. అమరావతిని శ్మశానం అన్నారు. ఏపీ రాజధానిని సర్వనాశనం చేశారు. అమరావతికి భూములు ఇచ్చిన రైతులను రెండున్నరేళు నానాతిప్పలు పెట్టారు. కేసులు, లాఠీదెబ్బలు, ఇనుప కంచెలతో ఏడిపించారు. హైకోర్టు తీర్పుతో పాలకుల పాపం పండింది. తాడేపల్లి ప్యాలెస్‌లో న్యాయం దక్కకున్నా.. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో న్యాయం నిలిచింది..గెలిచింది. హైకోర్టు ఆదేశాలతో అమరావతి కోసం వడివడిగా కార్యచరణ ప్రారంభించారు సీఆర్‌డీఏ అధికారులు. ఓవైపు మంత్రి బొత్స అర్థపర్థం లేని వాదనలు తెరమీదకు తీసుకొస్తున్నా.. హైదరాబాదే రాజధాని.. అమరావతి కేవలం శాసన రాజధాని.. అంటూ ఏవేవో వ్యాఖ్యలు చేస్తున్నా.. అవన్నీ ఫ్రస్టేషన్‌లో వస్తున్న మాటలే కానీ.. హైకోర్టు తీర్పు ముందు అవేవీ నిలిచేవి కాదు. ఆ విషయం అందరికంటే ప్రభుత్వానికే బాగా తెలుసు. అందుకే, ఇక తప్పదంటూ.. తప్పేలా లేదంటూ.. అమరావతి నిర్మాణం వైపు అడుగులు వేస్తోంది. రెండున్నరేళ్లుగా ఆగిపోయిన కార్యచరణను మళ్లీ పునఃప్రారంభించారు సీఆర్‌డీఏ అధికారులు.రాజధాని నిర్మా ణంపై హైకోర్టు తీర్పుతో సీఆర్డీఏ అధికారుల్లో కాస్త కదలిక వచ్చింది. నెల రోజుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్లాట్లను అభివృద్ధి చేసి.. రైతులకు 3 నెలల్లో అప్పగించాలని న్యాయస్థానం తన తీర్పులో స్పష్టం చేసింది. తీర్పు అమలులో భాగంగా.. ప్రభుత్వం ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసింది. సీఆర్డీఏ కమిషనర్ విజయ కృష్ణన్ మార్చి 14 వరకూ అందుబాటులో లేకున్నా.. అప్పటి వరకూ పనులు పెండింగ్‌లో పెట్టకుండా.. పురపాలక శాఖ ప్రత్యే క ప్రధాన కార్యదర్శి కార్యచరణ మొదలుపెట్టేశారు. కమిషనర్ లేకుండానే పనులు చేస్తున్నారంటే.. హైకోర్టు ఇచ్చిన టైంబౌండ్ ఆదేశాలు ఎంత కచ్చితమైనవో.. తేడా వస్తే ఎంత సీరియస్ అవుతుందో.. సర్కారుకు, సీఆర్‌డీఏకు బాగా తెలుసు. అందుకే, ఇంతటి హడావుడి అంటున్నారు. పురపాలక శాఖ ప్రత్యే క ప్రధాన కార్యదర్శి స్వయంగా సీఆర్డీఏ కార్యాలయానికి వచ్చి అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈ నెలలోనే పూర్తి చేయాలని ఆదేశించారు. రాజధాని నిర్మాణం కోసం గత ప్రభుత్వం 28,587 మంది రైతుల నుంచి 34,385 ఎకరాలను సమీకరించింది. ప్రతిగా వారికి నివాస, వాణిజ్య ప్లాట్లను అభివృద్ధి చేసి ఇవ్వాలనేది ఒప్పందం. ఆ మేరకు భూ యజమానులకు మొత్తం 64,735 ప్లాట్లను కేటాయించింది. ఇందులో 38,282 నివాస... 26,453 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో 40,378 ప్లాట్లను రైతుల పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రక్రియ నిలిచిపోయింది. హైకోర్టు తీర్పుతో ఎట్టకేలకు మళ్లీ కదలిక వచ్చింది. ఇంకా 24,357 ప్లాట్లను ఆయా రైతుల పేరిట రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. సోమవారం నుంచి ఈ ప్రక్రియను సీఆర్డీఏ అధికారులు తిరిగి ప్రారంభించారు. అధికారులు సంబంధిత రైతులకు ఫోన్లు చేసి.. మీకు కేటాయించిన ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకోమని కోరుతున్నారు. ఆహా.. ఎంతలో ఎంత మార్పు.. హైకోర్టు ఆదేశిస్తే కానీ రిజిస్ట్రేషన్లు చేయని సర్కారుకు ఆ తీర్పు చెంపపెట్టు.. అంటున్నారు.

# వివేకా కేసు...రంగంలోకి ఈడీ

కడప, మార్చి 9,వివేకా హత్య కేసులో సీబీఐ బాగా స్పీడ్ పెంచింది. ఆ క్రమంలో ఈ కేసులో పాత్రధారులే కాదు.. సూత్రదారుల పని పట్టేందుకు తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది సీబీఐ. ఆ క్రమంలో రేపోమాపో.. ఈ కేసు దర్యాప్తు కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా రంగంలోకి దిగనున్నారని సీబీఐ స్పష్టం చేస్తోంది. ఇప్పటికే వివేకా హత్యకు 40 కోట్ల రూపాయిల సుపారీ అంటూ ఈ కేసులో అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి.. సీబీఐ అధికారుల ఎదుట వాగ్మూలం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో నిందితుల నుంచి ఈ నగదు వివరాలు సేకరించేందుకు ఈడీ అధికారులు రంగంలోకి దిగి.. సుపారీ లెక్క తేల్చే పనిలో ఉన్నారని తెలుస్తోంది. 2019, ఫిబ్రవరి 10న వివేకా హత్యకు ఎర్ర గంగిరెడ్డి ఇంట్లోనే స్కెచ్ వేశారని సీబీఐకి దస్తగిరి చెప్పిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత నాలుగు రోజులకు అడ్వాన్స్ కింది.. సునీల్ యాదవ్.. కోటి రూపాయలు తీసుకు వచ్చి తనకు ఇచ్చారని.. దస్తగిరి తెలిపారు. అయితే ఈ డబ్బులు సునీల్ యాదవ్‌కు ఎవరిచ్చారు. వాళ్లకు ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందనే అంశాలపై ఇప్పటికే సీబీఐ ఆరా తీసింది. సుపారీ సొమ్ముపై ఓ స్పష్టత వస్తే.. ఈ అసలు కుట్రకు సూత్రధారులు ఎవరో తెలిపోతోందని సీబీఐ ఆలోచిస్తుంది. మరోవైపు వివేకా హత్యకు సుపారీగా చెల్లించిన నగదును నిందితులకు ఎవరిచ్చారు? అంత మొత్తం ఎక్కడి నుంచి వచ్చింది? ఎలా వచ్చింది? ఇత్యాది అంశాలపై సీబీఐ ఇప్పటికే కొన్ని ఆధారాలు సేకరించింది. వివేకాను చంపితే దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి 40 కోట్ల రూపాయిలు ఇస్తారని .. అందులో 5 కోట్లు తనకు ఇస్తారని ఎర్రగంగిరెడ్డి చెప్పినట్లు దస్తగిరి.. సీబీఐ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో స్పష్టం చేశారు. వివేకానందరెడ్డిని చంపేయి.. నీతో మేము వస్తామని.. ఈ హత్య కుట్ర వెనుక వైయస్ అవినాష్ రెడ్డి, వైయస్ భాసర్కరెడ్డి, వైయస్ మనోహర్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి వంటి పెద్ద వాళ్లు ఉన్నారని ఎర్రగంగిరెడ్డి.. తనతో చెప్పారని దస్తాగిరి.. సీబీఐ వాంగ్మూలంలో పేర్కొన్నారు. అయితే దస్తాగిరితో గంగిరెడ్డి చేసిన వ్యాఖ్యలకు... సుపారీ సొత్తుకు ఎలాంటి సంబంధం ఉంది అనే అంశంపై కూడా సీబీఐ దృష్టి పెట్టింది. ఇక ఈ కేసులో ఇతర నిందితులకు అడ్వాన్స్ చెల్లింపులు జరిగాయా? జరిగితే అవి ఎక్కడి నుంచి ఎలా వచ్చాయనే కోణంలో సీబీఐ ఆరా తీస్తోంది. ఆర్థిక మూలాల లెక్క తేల్చేందుకు ఈడీ అధికారులు రంగంలోకి దిగాలని నిర్ణయించినట్లు సమాచారం. అయితే వివేకా హత్యకు ముందు.. ఆ తర్వాత ఎంత మొత్తం చేతులు మారిందనే అంశాలపై కూడా సీబీఐ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అలాగే నిందితులకు అడ్వాన్స్‌గా చెల్లించిన నగదు ఎక్కడి నుంచి వచ్చింది? వాటి వెనుక ఉన్న ఆర్థిక మూలాలుపై కొన్ని ఆధారాలు సైతం సీబీఐ ఇప్పటికే సేకరించింది. వాటిని ఈడీ అధికారులకు ఇవ్వడం వల్ల.. వారి పని కొంత సులువు అవుతోందనే భావనలో సీబీఐ ఉంది. అయితే ఈడీ అధికారులు రంగంలోకి దిగుతున్నారనే టెన్షన్‌లో ఈ హత్య కేసులో సూత్రధారులు ఉన్నారని తెలుస్తోంది. ఈ వివేకా హత్య కేసులో ఏ నిమిషం.. ఏం జరుగుతుందో.. ఎవరిని అరెస్ట్ చేస్తారో అనే భయం గుప్పెట్లోకి కడప జిల్లా జారిపోయింది.

# కొడాలి వర్సెస్ వంగవీటి తప్పదా....



విజయవాడ, మార్చి 9, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కొడాలి నానికి చెక్ పెట్టేందుకు మాజీ ఎమ్మెల్యే, వంగవీటి రంగా తనయుడు వంగవీటి రాధా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారా? ఆ క్రమంలో గుడివాడ వేదికగా ఆయన.. తన సామాజిక వర్గం నేతలతో తరచు సమావేశాలు, చర్చలు జరుతున్నారా? అంటే అవుననే అంటున్నారు సదరు పట్టణ పురజనులు. ఆయన తాజాగా గుడివాడలోని ఆర్టీసీ కాలనీలో నియోజకవర్గంలోని కాపు సంఘం ముఖ్య నేతలతో వంగవీటి రాధా సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ఆ సామాజిక వర్గం నేతలతో పాటు.. వివిధ రాజకీయ పార్టీల నేతలు సైతం పాల్గొన్నారు. అధికార జగన్ పార్టీకి చెందిన నేతలు అయితే ఈ సమావేశానికి అధిక సంఖ్యలో హాజరు కావడం గమనార్హం. గుడివాడ మీదుగా... ఏ ప్రాంతానికి వెళ్లినా.. సదరు పట్టణాన్ని వేదికగా చేసుకుని వంగవీటి రాధా తరచూ.. ఆయన సామాజిక వర్గానికి చెందిన నేతలతో కీలక సమావేశాలు జరపడం పట్ల.. భవిష్యత్తులో ఆయన ఇక్కడి నుంచి అసెంబ్లీకి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయనే ఊహాగానాలు అయితే జోరుగా ఊపందుకొన్నాయి. కృష్ణాజిల్లాలో రాజకీయ చైతన్యం చాలా అదికంగా ఉంటుందన్న సంగతి అందరికీ తెలిసేందే. అలాంటి జిల్లాలో అదీ బెజవాడను వదిలి గుడివాడ నుంచి వంగవీటి ఎందుకు రంగంలోకి దిగాలనుకుంటున్నారనే ప్రశ్న అయితే జిల్లా వ్యాప్తంగా ఉత్పన్నమవుతోంది. మరోవైపు.. కొడాలి నాని, వంగవీటి రాధా మంచి స్నేహితులన్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే తన స్నేహితుడు కొడాలి నానికి వంగవీటి రాధా ఎందుకు చెక్ పెట్టాలని భావిస్తున్నాడంటే.. అందుకు నియోజకవర్గ ప్రజలు పలు కారణాలు చెబుతున్నారు. మంత్రి కొడాలి నానికి గుడివాడ కంచుకోట అన్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే 2019 అసెంబ్లీ ఎన్నికల్లో దేవినేని రాజశేఖర్ తనయుడు దేవినేని అవినాష్‌ను సైకిల్ పార్టీ అభ్యర్థిగా బరిలలోకి దింపిందీ టీడీపీ. కానీ ఈ ఎన్నికల్లో కొడాలి నానినే గెలుపొందారు. వంగవీటి ఫ్యామిలీకి, దేవినేని ఫ్యామిలీకి చాలా కాలంగా రాజకీయ వైరం ఉన్న విషయం విధితవే. అయితే గుడివాడ నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గం ఓట్లు అత్యధికంగా ఉన్నాయి. అంతేకాదు.. అభ్యర్థి గెలుపునకు ఈ ఓట్లే అత్యంత కీలకమన్న విషయం కూడా తెలిసిందే. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో ఫ్యాన్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కొడాలి నాని చాలా పకడ్బందీగా వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. సదరు సామాజిక వర్గానికి చెందిన నేత వంగవీటి రంగాను హత్యకు కారణమైన వారు.. ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారని. వారిని ఓడించేందుకు మీరంతా ఫ్యాన్ పార్టీకి ఓటు వేయాలని తన ప్రచారంలో కొడాలి నాని పిలుపు నిచ్చారు. అంతేకాదు.. తన గెలుపు కోసం.. సదరు సామాజిక వర్గాన్ని ఎన్ని విధాలుగా .. ఎన్ని రకాలుగా వాడుకోవాలో అన్ని విధాల కొడాలి నాని వాడుకొని.. ఆ ఎన్నికల్లో గెలుపొందారు. ఆ తర్వాత సదరు సామాజిక వర్గాన్ని దూరం పెట్టారనే టాక్ అయితే సదరు నియోజకవర్గంలో జోరుగా వైరల్ అయింది. సదరు సామాజిక వర్గం వారు.. ఏదైనా పని చేయించుకోవాలని.. మంత్రి కొడాలి నాని వారి వద్దకు వెళ్తే.. రేపుమాపు అంటూ వారిని నానా ఇబ్బందులకు గురి చేసేవారనే టాక్ కూడా గుడివాడలో బలంగానే ఉంది. అంతేకాదు.. వంగవీటి రాధాతోపాటు ఆయన అభిమానులపై కొడాలి నాని తరచు బహిరంగంగానే సెటైరికల్ కామెంట్స్ చూస్తున్నాడనే చర్చ కూడా గుడివాడ నియోజకవర్గంలో చాలా హాట్ హాట్‌గా నడుస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి కొడాల నాని వ్యవహారాన్ని .. గుడివాడ వచ్చిన వంగవీటి రాధా ముందు నియోజకవర్గంలోని కాపు నేతలంతా ఉంచినట్లు సమాచారం. అంతేకాకుండా.. బెజవాడను వదిలి గుడివాడ నుంచి ఎన్నికల బరిలోకి దిగితే.. తామంతా మీకు అండగా ఉండడమే కాకుండా.. రానున్న ఎన్నికల్లో మీ గెలుపు కోసం తామంతా శాయశక్తుల కృషి చేస్తామని వంగవీటి రాధతో సదరు సామాజిక వర్గ నేతలు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అదీకాక.. గుడివాడ నియోజకవర్గంలో కూడా రాజకీయ చైతన్యం అధికం. ఇక్కడ నుంచి పోటీ చేసి గెలిచి.. కొడాలి నాని కంచు కోటను బద్దలు కొట్టాలనే వ్యూహంలో భాగంగానే వంగవీటి.. గుడివాడ వేదికగా.. రాజకీయం చేయాలని భావిస్తున్నారనే టాక్ అయితే సదరు నియోజకవర్గంలో వైరల్ అవుతోంది.

## బ్రదర్ అనిల్.. భయపెడుతున్నారా

నెల్లూరు,మార్చి 9,కొద్ది రోజులుగా బ్రదర్ అనిల్ కుమార్ ఆంధ్రప్రదేశ్ లో పర్యటనలు చూస్తుంటే కొంత ఆశ్చర్యం కలగక మానదు. ఆయన తన బావ ముఖ్యమంత్రి జగన్ కు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నట్లు అర్థమవుతుంది. గత ఎన్నికల్లో జగన్ విజయానికి కృషి చేసిన వైఎస్ షర్మిల, బ్రదర్ అనిల్ లు ఈసారి రివర్స్ అయినట్లే కనపడుతుంది. ఏపీలో అధికారంలోకి వచ్చిన తర్వాత తనను పట్టించుకోవడం లేదని ఆగ్రహించి తెలంగాణలో షర్మిల కొత్త పార్టీ పెట్టారు. జగన్ ను దెబ్బతీయడానికే. అయితే ఏపీలోనూ తన అన్న జగన్ ను దెబ్బతీయడానికి ఆమె ప్రయత్నిస్తున్నారని అర్థమవుతుంది. తెలంగాణలో తన పార్టీలో వైసీపీ నేతలు ఎవరూ చేరకుండా అన్న మనుషులే అడ్డుకుంటున్నారని ఆమె సన్నిహితుల వద్ద వ్యాఖ్యానిస్తున్నట్లు సమాచారం. తెలంగాణలో తన పార్టీలో కొందరు చేరడానికి సిద్దమయినా వారిని వారించినట్లు షర్మిల ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో షర్మిల నేరుగా రంగంలోకి దిగకుండా తన భర్త బ్రదర్ అనిల్ కుమార్ ను రంగంలోకి దించినట్లు సమాచారం. బ్రదర్ అనిల్ కుమార్ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ తో ఇటీవల భేటీ కావడం రాజకీయ కారణాలేనని చెప్పక తప్పదు. ఉండవల్లి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు. కానీ ఏపీలో జగన్ కు ఇటీవల యాంటీ అయ్యారు. జగన్ పాలన సక్రమంగా లేదని ఆయన పదే పదే ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉండవల్లితో బ్రదర్ అనిల్ భేటీ మర్యాదపూర్వకంగానే అని చెబుతున్నప్పటికీ జగన్ వ్యవహారశైలి గురించి మాట్లాడుకున్నట్లు చెబుతున్నారు. బద్రర్ అనిల్ అంతటితో ఆగలేదు. వైఎస్ జగన్ పై అసంతృప్తిగా ఉన్న వర్గాలను కలిసే ప్రయత్నం చేస్తున్నా?. వీరిలో ముఖ్యంగా బీసీ, మైనారిటీ నేతలున్నారు. గత ఎన్నికల్లో వీరితో బద్రర్ అనిల్ మాట్లాడి జగన్ కు అండగా నిలబడేలా ప్రయత్నించారు. ఈసారి మాత్రం ఏమీ చెప్పకుండానే బ్రదర్ అనిల్ వెళ్లిపోయారని తెలిసింది. వారి సమస్యలను అడిగి తెలుసుకుని వెళ్లిపోయారని తెలిసింది. ఏపీలో కొత్త పార్టీ పెట్టే ఆలోచన లేదని బ్రదర్ అనిల్ చెప్పినప్పటికీ తన బావ జగన్ కు వ్యతిరేకంగా ఒక బ్యాచ్ ను తయారు చే?స్తున్నట్లే కనపడుతుంది.

## హాని ట్రాపింగ్ కలకలం

తిరుపతి,మార్చి 9, ఆంధ్రప్రదేశ్‌లో హాని ట్రాపింగ్ వ్యవహారం కలకలం సృష్టించింది. ఫేస్‌బుక్ ద్వారా ఫోన్‌లను హ్యాక్ చేసి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బును మాయం చేస్తున్న కిలాడీ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన చిత్తూరు జిల్లాలో చోటుచేసుకుంది. హాని ట్రాపింగ్‌కు పాల్పడిన 8 మంది సభ్యుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నిందితులంతా ఫేస్‌బుక్ ద్వారా ఫోన్లను హ్యాక్ చేసి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బును మాయం చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అల్లరి పిల్ల అనే ఫేస్ బుక్ ప్రొఫైల్‌తో పలువురికి వల వేసి మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. మొదట అల్లరి పిల్ల ఐడీ ద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపించి.. ముఠా బాధితులతో పరిచయం పెంచుకుంటుంది.ఆ తర్వాత ఫేస్‌బుక్ మెస్సెంజర్ ద్వారా చాటింగ్ చేసి.. యువతుల ద్వారా వీడియో కాల్స్ చేయిస్తారు. అయితే.. వీడియో కాల్స్ మాట్లాడడానికి ఐఎంఓ అప్లికేషన్ ఇన్ స్థాల్ చేసుకోమని ఒత్తిడి చేస్తారు. అలా ఐఎంఓ అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసిన బాధితులతో యువతులు మాట్లాడినట్లు మాయ చేస్తారు. అనంతరం ఐయంఓ లిటిల్ అప్లికేషన్ ద్వారా మొబైల్ హ్యాక్ చేస్తారు. ఇలా చిత్తూరులో సీకే మౌనిక్ అనే యువకుడి బ్యాంక్ ఖాతా నుండి నుంచి దాదాపు 4 లక్షల రూపాయలు కాజేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు కేసు నమోదు చేసిన చిత్తూరు పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేసి నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులు విశాఖపట్నం, వరంగల్, కడప జిల్లాలకు చెందిన వారుగా పోలీసులు తెలిపారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## బీజేపీతో దోస్తికి ప్రయత్నాలు

గుంటూరు, మార్చి 9, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు స్ట్రాటజీ మార్చినట్లే కన్పిస్తుంది. బీజేపీకి దూరం జరగాలని నిర్ణయించుకున్నట్లు ఆయన అడుగులు స్పష్టం చేస్తున్నాయి. బీజేపీతో దోస్తీకి ప్రయత్నిస్తున్నా అటు నుంచి సానుకూల సంకేతాలు రావడం లేదు. పైగా జగన్ వైపు బీజేపీ మొగ్గు చూపుతున్నట్లు ఆయనకు సమాచారం అందింది. దక్షిణాది రాష్ట్రాలలో పోస్ట్ పోల్ అలయన్స్ కు బీజేపీ వైసీపీ వైపు చూస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. అవిశ్వాసం నుంచి బయటపడతారా? రాష్ట్రంలో బీజేపీ పెద్దగా ప్రభావం చూపే అవకాశం లేదు. పైగా మోదీపై వ్యతిరేకత కొంత తనకు సానుకూలంగా మారవచ్చన్న అంచనాల్లో చంద్రబాబు ఉన్నారు. జనసేన పార్టీ బీజేపీతో విడిపోయి తనతో చేరవచ్చన్న అభిప్రాయంతో చంద్రబాబు ఉన్నారు. ఎన్నికల్లో నేరుగా జగన్ బీజేపీతో పొత్తు పెట్టుకునే అవకాశం లేదు. కమ్యునిస్టులు, జనసేనను కలుపుకుని తాను ఎన్నికలకు వెళితే సానుకూల ఫలితాలు వచ్చే అవకాశముందని చంద్రబాబు ఆశిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికలతో కలిపి ఏపీ ఎన్నికలు వచ్చే అవకాశం ఉండటంతో తన పార్టీకి బీజేపీ పెద్దగా ఇబ్బందులు కలిగించదన్న ఆలోచన చంద్రబాబుకు ఉంది. అందుకే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలని దూరం పెట్టి మిగిలిన కలసి వచ్చే పార్టీలతో ఎన్నికలకు వెళ్లేందుకు చంద్రబాబు సమాయత్త మవుతున్నారు. ఇందుకు బడ్జెట్ సమావేశాల సందర్భంగా జరిగిన ఘటనే ఉదాహరణ.

# అరణియార్ పర్యాటకానికి మహర్దశ

తిరుపతి, మార్చి 9, చిత్తూరు జిల్లాలో ఉన్న అరణియార్ పర్యాటకానికి మహర్దశ కలగనుంది. ప్రాజెక్టు సుందరీకరణ, అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు అవసరమైన నిధులు సమకూర్చడానికి తుడాతో పాటు పర్యాటక శాఖకు గత ఏడాది ప్రతిపాదనలు అందాయి. అంతే వేగంగా స్పందించిన తుడా రూ.1.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు జనవరి 3న తుడా వీసీ హరికృష్ణ అరణియార్‌ను సందర్శించి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పర్యాటక శాఖకు రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. అరణియార్ అభివృద్ధి, సుందరీకరణ పనులకు 20 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు వద్ద జైకా నిధులు రూ.35 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఈ నిధుల మంజూరులో తిరుపతి ఎంపీ గురుమూర్తి సహకారంతో స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేసిన కృషి, చొరవ ప్రశంసనీయమైనది. . పర్యాటల శాఖ అందించే నిధులతో అదనంగా మరో బోటింగ్, రిసార్టులు, చిల్డ్రన్స్ పార్క్, ఉద్యానవనాల అభివృద్ధి, సినిమా, టీవీ సీరియళ్ల షూటింగ్‌కు అనువుగా పచ్చిక మైదానాలు నిర్మించనున్నారు.పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టు గతంలో షూటింగ్ స్పాట్‌గా పేరొందింది. ఇక్కడ సుమారు 20 సినిమాలకు పైగా చిత్రీకరణ సాగింది. అందులో ప్రధానంగా జానకిరాముడు, ప్రేమదేశం, అన్నకిళి, టూటౌన్ రౌడీ సినిమాలు సూపర్ హిట్ అందుకున్నాయి. దీంతోపాటు వందలాది సినిమాల్లో పాటల చిత్రీకరణ ఇక్కడే సాగింది. తెలుగు, తమిళం సినిమాల్లోని పాటల చిత్రీకరణకు ఇది చాలా అనువైన ప్రదేశంగా నిలిచింది. టీవీ సీరియళ్లు ఎక్కువ కాలం పాటు చిత్రీకరించేవారు. నాగమ్మ టీవీ సీరియల్ 80 శాతం ఇక్కడే రూపుదిద్దుకుంది. బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్, రాజేంద్రప్రసాద్, విజయశాంతి, రాధ వంటి మన తెలుగు హీరో, హీరోయిన్లు ఎందరో ఇక్కడ చిత్రీకరణలో సందడి చేసినవారే. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి, మహా నగరమైన చెన్నై జాతీయ రహదారి పక్కనే కొలువైన అతిపెద్ద జలాశయం బహుసుందరంగా ఉంటుంది. ఇక్కడి నుంచి తిరుపతి, చెన్నై నగరాలకు 60 నుంచి 70 కిలోమీటర్ల దూరం ఉంటుంది. చెన్నై నుంచి తిరుమలకు వెళ్లే యాత్రికులకు అరణియార్ వద్ద సేద తీరేవారు. ఇక్కడ ప్రకతి అందాలు సైతం ఆహ్లాదకరంగా ఉంటాయి.ఇక్కడ ఆకట్టుకునే ఉద్యానవనం ఉండడంతో వెండితెర, బుల్లితెర దర్శకులు తరలివచ్చేవారు. అయితే 20 ఏళ్ల క్రితం పర్యాటక నిర్వహణకు నిధులు నిలిపివేయడంతో పార్కులన్నీ వెలవెలబోయాయి. ఇన్నేళ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అరణియార్ సుందరీకరణకు శ్రీకారం చుట్టడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అరణియార్ ప్రాజెక్టుకు పూర్వ వైభవం తీసుకురావడానికి ఎమ్మెల్యే ఆదిమూలం తీవ్రంగా కృషి చేస్తున్నారు.

## మాజీ మంత్రి దేవినేని ఉమ హౌస్ అరెస్ట్

గొల్లపూడి మార్చి 9,మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరావును పోలీసులు వరుసగా రెండో రోజు కూడా హౌస్ అరెస్ట్ చేశారు. మైలవరం రెవెన్యూ డివిజన్ ప్రకటించాలని అఖిలపక్షం పిలుపునిచ్చిన జి.కొండూరు బంద్ కార్యక్రమానికి బయలుదేరనివ్వకుండా దేవినేని ఉమాను గొల్లపూడి లో పోలీసులు హౌస్ అరెస్ట్ చేసి నిలిపివేశారు.మరోవైపు జి కొండూరు బంద్‌కు మైలవరం రెవిన్యూ డివిజన్ పోరాట సాధన సమితి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. బంద్‌కు టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, ఎమ్మార్పీఎస్‌లు మద్దతు తెలిపాయి. కాగా... బంద్‌కు అనుమతులు ఇవ్వని పోలీసులు... దుకాణలను బలవంతంగా మూసివేయిస్తే అరెస్ట్‌లు చేస్తామని నాయకులకు హెచ్చరికలు జారీ చేశారు. అయితే పోలీసులు ఎన్ని అడ్డంకులు కలిగించినా జి.కొండూరు బంద్‌ను విజయవంతం చేస్తామని సాధన సమితి నాయకులు స్పష్టం చేశారు. పోలీసుల నిరంకుశ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## లారీని ఢీకొట్టిన వెన్నెల బస్సు?క్లీనర్ మృతి

నందిగామ మార్చి 9, కృష్ణా జిల్లా కంచికచర్ల మండలం పరిటాల శివారు బైపాస్ పై రోడ్డు ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న లారీని ఏపీఎస్ఆర్టీసీ వెన్నెల బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు క్లీనర్ మూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయింది. మృతుడు నూజివీడు ప్రాంతానికి చెందిన వేదుల సూర్యనారాయణ మూర్తి గా గుర్తించారు.సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## సింగరేణి గనిలో ప్రమాదం

### మృతుల కుంటుంబాల ఆందోళన

రామగుండం మార్చి 9, రామగుండం ఏరియా గోదావరిఖని ఏ ఎల్ పి గని ప్రమాదంలో మరణించిన కాంట్రాక్ట్ కార్మికుని కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం తోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కుటుంబ సభ్యులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులు కార్మిక సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. గత మూడు రోజుల క్రితం అర్జీ3 పరిధిలోని అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టులో జరిగిన ప్రమాదంలో బొగ్గు పొరల కింద చిక్కుకున్న ఆరుగురు కార్మికుల్లో ముగ్గురిని సురక్షితంగా కాపాడిన రెస్క్యూ టీం మరో ముగ్గురు కోసం గాలింపు చర్యలు చేపట్టగా నిన్న అర్ధరాత్రి సింగరేణి అధికారులతో పాటు ఒక కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందినట్లు గుర్తించారు. మరణించిన అధికారులతో పాటు కాంట్రాక్టు కార్మికుని డెడ్ బాడీలను గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి శవ పంచనామా చేసి అధికారుల కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాని కాంట్రాక్టు కార్మికుడు శ్రీకాంత్ కుటుంబానికి న్యాయం చేసేంతవరకు డెడ్ బాడీ ని తరలించేది లేదని కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. అధికారులకు ఒక న్యాయం కార్మికుల కు ఒక న్యాయమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేంతవరకు ఆందోళన విరమించేది లేదని, అవసరమైతే సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికుల ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు తిరుపతి గౌడ్ హెచ్చరించారు.

## ఇళ్లు కూల్చివేత

మచిలీపట్నంమార్చి 9, కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో ఇళ్ల కూల్చివేత ఉద్రిక్తతకు దారి తీసింది. కూల్చివేతల నేపథ్యంలో రెవిన్యూ అధికారులు, భారీగా పోలీసుల మోహరించారు. బలవంతంగా పేదల ఇళ్ళు కూల్చివేస్తున్నారని బాధితులు పెట్రోల్ పోసుకుని ఆత్మహ త్య చేసుకునేందుకు యత్నం చేసారు. గత ఎనిమిది సంవత్సరాలుగా ఇక్కడే జీవిస్తున్నాం.. కరెంటు, నీటి వసతి లేకున్నా మా బ్రతుకులు ఈడ్చుకుం టున్నామని వారు అన్నారు. పుస్తెలు తాకట్టు పెట్టుకుని ఇక్కడ ఇళ్ళు నిర్మించుకున్నాం. ఉన్నపళంగా కాళీచేసి వెల్లమంటే మేము ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు. నిర్వాసితులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. తరువాత జె.సి.బిల సహాయంతో ఇళ్ల కూల్చివేతను ప్రారంభించారు.

## మహిళలే నడిపించిన రైలు

విశాఖపట్నం మార్చి 9, కేవలం మహిళా సిబ్బందితోనే నడిచే ప్యాసింజర్ రైలును విశాఖలో ప్రారం భించారు. మహిళా దినోత్సవం సంద ర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విశాఖ రాయగడ ప్యాసింజర్ రైలును తూర్పు కోస్తా రైల్వే విమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు పారిజాత సత్పతి జెండా ఊపి ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించగ లరనే విషయాన్ని తెలియజేయటం కోసం కేవలం మహిళా ఉద్యోగినులచే నడిచే విధంగా రైలును ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు.ఈ రైలులో ఇంజన్ డ్రైవర్ లోకొపైలెట్, గార్డ్, టిక్కెట్ చెకింగ్ స్టాఫ్, ఆర్పీఎఫ్ సిబ్బందితో పాటు అందరూ మహిళలు ఉంటారని తెలిపారు. రైల్వేలో దాదాపు అన్ని విభాగాల్లో పురుషులతో సమానంగా మహిళలు కీలకమైన విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. వారికి తగిన గుర్తింపు, ప్రోత్సాహం అందించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని పారిజాత సత్పతి తెలిపారు.

## 160 సీట్లు గెలుస్తామంటున్న టీడీపీ

విజయవాడ, మార్చి 9, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో రాజకీయాలు ఎన్నికలతో సంబంధం లేకుండా ఎప్పుడు హాట్ హాట్ గానే ఉంటాయి. అధికార ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంటుంది. తాజాగా టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అధికార వైసీపీ నేతలు చేసిన ఛాలెంజ్ పై స్పందించారు. అధికార పార్టీ చేసిన ఛాలెంజ్ లో భాగంగా ముందస్తు ఎన్నికల కు వెళదామని చెప్పారు. అంతేకాదు ఎన్నికలు ఎపుడు వచ్చినా .. టీటీడీ సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రస్తుతం ఏపీలో అధికార పార్టీ ప్రభుత్వం పై తీవ్ర వ్యతిరేకత ఉంది..వ్యతిరేకత పెరిగితే నష్టం జరుగుతుందని.. ముందుస్తుగా ఎన్నికలకు వెళ్లే ఆలోచన ప్రభుత్వం చేస్తుందంటూ అచ్చెన్నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలు కూడా తోందర్లోనే ఎన్నికలు వస్తాయని అనుకుంటున్నారు..తాము కూడా అదే భావిస్తున్నామని చెప్పారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలకు వెళ్లినా.. టీడీపీకి ఏపీ ప్రజలు పట్టంకడతారని.. 160 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తాము ఈ విషయం గుడ్డిగా చెప్పడం లేదని.. రాష్ట్రంలో ఆ పరిస్థితులు అలా ఉన్నాయంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.ఏజెన్సీ లో అక్రమ మైనింగ్ జరుగుతోందని అందరికి తెలుసు.. ఆ ప్రాంతాలకు తాము కూడా వెళ్ళామని అచ్చెన్నాయుడు చెప్పారు. మావోయిస్టులు లేఖ వెనుక టీడీపీ ఉందని అంటారు. బాధ్యత ఉంది కనుక మావోయిస్టులు ప్రకటన చేశారు.. దానికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. ప్రతి దానికీ టీడీపీ ఉందని ప్రభుత్వానికి చెప్పడం అలవాటు అయ్యిందని అన్నారు.

# ఆపరేషన్ ఆకర్ష్ లో పవన్



ఏలూరు, మార్చి 9, వచ్చే ఎన్నికల్లో జగన్ వెర్సస్ పవన్ అని తేలిపోయింది.సినిమాల పరంగా తనను పూర్తిగా అడ్డుకుంటూ తన మూలాలను దెబ్బ కొట్టే విధంగా జగన్ చేస్తున్న పనులను నిరసించడంలో పవన్ ప్రయత్నిస్తున్నారు.ఇందులో భాగంగా విజయం సాధించారు కూడా! రెండు సినిమా మీటింగులను కూడా తనకు అనుగుణంగా మార్చుకుని జగన్ పై యుద్ధం చేశారు. రిపబ్లిక్ ఫంక్షన్లోనూ, వకీల్ సాబ్ ఫంక్షన్లోనూ తన వాదం ఏంటో చెప్పారు.అదేవిధంగా భీమ్లా నాయక్ విడుదలకు ముందే మత్స్యకార సభ ఒకటి నిర్వహించి ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. తనను ఎలా అడ్డుకున్నా పడినా లేచి వస్తాను అని చెబుతున్న పవన్ తన మాట తో చేతతో మరింత వేగంగా దూసుకుపోవాలని ప్రయత్నిస్తున్నారు.ఈ క్రమంలో భాగంగానే ఆయన ఇతర పార్టీల నాయకులను సైతం తన గూటికి చేర్చుకుని జగన్ కు గట్టి ఝలక్ ఇవ్వాలని పరితపిస్తున్నారు.ఇదే కనుక జరిగితే కీలక నేతల చేరికలే స్పష్టం అయితే జగన్ కు ఈ సారి మంచి ఫలితాలు రావడం ఖాయం.ఎన్నికల షెడ్యూల్ వచ్చే వరకూ ఆగేలా లేదు పవన్.ఎలా అయినా ఈ సారి మంచి స్థాయిలో బల నిరూపణ చేసి ఆశించిన సీట్లు దక్కించుకుని వైసీపీకి ఝలక్ ఇవ్వాలని అనుకుంటున్నారు.శత్రువు ఎవరో తెలిసి పోయాక యుద్ధం చేయడం అన్నది సులువు. ఆ విధంగా పవన్ ఈ సారి శత్రువు స్పష్టంగా ఎవరు అన్నది తేల్చేశారు.దీంతో రానున్న ఎన్నికల్లో జగన్ కు గట్టిగా పోటీ ఇచ్చేందుకు శ్రమిస్తున్నారు పవన్. ఇందులో భాగంగా ఇతర పార్టీల నేతలను తన పార్టీలోకి ఆహ్వానించే చర్యల్లో భాగంగా టీడీపీ కి చెందిన మంగళగిరి పట్టణ మాజీ అధ్యక్షుడ్ని ఇవాళ పార్టీలో చేర్చుకున్నారు. ఇక్కడి నుంచి మొదలయ్యే చేరికలు రానున్న కాలంలో మరింత ఎక్కువ కానున్నాయి అని తెలుస్తోంది.ఒక సీటు నుంచే పోటీరాజకీయాలో ఏ పార్టీ అధినేత అయిన సత్తా చాటితేనే..ఆ పార్టీ కూడా సత్తా చాటుతుంది?అసలు అధ్యక్షుడే చతికలపడితే?పార్టీ పరిస్తితి కూడా ఘోరంగా ఉంటుంది?గత ఎన్నికల్లో ఏపీలో జనసేన విషయంలో అదే జరిగిందని చెప్పొచ్చు. జనసేన అధినేత పవన్ కల్యాణ్?రెండు చోట్ల పోటీ చేసి ఘోరంగా ఓడిపోయారు..భీమవరం, గాజువాకలో పోటీ చేసి ఓటమి పాలయ్యారు?పవన్ ఓడిపోవడం కాదు..జనసేన కూడా ఘోరంగా ఓడింది..కేవలం ఒక సీటు మాత్రమే గెలుచుకుంది.అయితే అది గత ఎన్నికల పరిస్తితి..కానీ ఈ సారి ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తుంది?ఇక జనసేన సత్తా చాటడం కంటే ముందు పవన్ సత్తా చాటాల్సిన అవసరం ఉంది..పవన్ ఈ సారి ఖచ్చితంగా గెలవాల్సి ఉంది..లేదంటే ఆయన రాజకీయ భవిష్యత్ డేంజర్‌లో ఉంటుంది?గత ఎన్నికలంటే జగన్ గాలి ఉంది?కానీ ఈ సారి అలా ఉండదు. పైగా కొన్ని స్థానాల్లో జనసేన?టీడీపీ, వైసీపీలకు ధీటుగా పుంజుకుంటుంది.అదే సమయంలో టీడీపీతో గాని జనసేన కలిస్తే పవన్ గెలుపే కాదు?ఇంకా జనసేన కొన్ని సీట్లు గెలుచుకునే అవకాశాలు చాలా ఎక్కువ ఉన్నాయి. కాబట్టి ఈ సారి పవన్ మాత్రం ఆచి తూచి అడుగులేయాల్సిన అవసరం ఉంది?టీడీపీతో పొత్తు పెట్టుకుంటే గెలుపు విషయంలో ఢోకా ఉండదు?ఒకవేళ పొత్తు లేకపోయిన సొంతంగా ఎలా గెలవాలనేది పవన్ చూసుకోవాలి?ముఖ్యంగా తాను గెలిచే సీటు చూసుకోవాలి. అయితే ఈ సారి పవన్ గాజువాక, భీమవరంల్లోనే పోటీ చేస్తారనేది క్లారిటీ లేదు. ఇప్పటికే తిరుపతిలో పోటీ చేస్తారని ప్రచారం వచ్చింది?ఇటీవల కాకినాడ సిటీ గాని, రూరల్ స్థానంలో గాని పోటీ చేస్తారని కథనాలు వచ్చాయి.కథనాలు అయితే వస్తున్నాయి గాని పవన్ సీటు మాత్రం ఫిక్స్ కావడం లేదు..అయితే త్వరగా సీటు ఫిక్స్ చేసుకుంటే మంచిదని చెప్పొచ్చు. జనసేన పార్టీ వర్గాల సమాచారం ప్రకారం..భీమవరం లేదా కాకినాడ రూరల్‌లో గాని పవన్ పోటీ చేస్తారని, ఈ సారి మాత్రం ఒక సీటులోనే పోటీ చేస్తారని తెలుస్తోంది.

# ఇద్దరు పిల్లలున్న మహిళ ఉద్యోగినులకే సెలవుల పొడిగింపు వర్తింపు

అమరావతి మార్చి 9ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు సెలవును పొడిగించింది. అయితే ఇద్దరు పిల్లలున్న వారికి మాత్రమే పొడిగింపు వర్తిస్తుందని స్పష్టం చేసింది. పిల్లల సంరక్షణకు వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు 60 రోజుల సెలవు దినాన్ని అమలు చేస్తోంది. అయితే ఈ సెలవు దినాన్ని 180 రోజులకు పెంచుతూ ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇద్దరి లోపు పిల్లలు ఉన్నవారికే ఈ అవకాశం ఉంటుందని వివరించారు.ఇదే కాకుండా ఏడాది లోపు వయసు ఉన్న వారిని దత్తత తీసుకున్నప్పుడు కూడా సెలవు వర్తిస్తుందని, పురుష ఉద్యోగులకూ 15 రోజులు పెటెర్నిటీ లీవ్స్ ఇస్తామని చెప్పారు. పెళ్లి చేసుకోని పురుషులు, భార్య మరణించిన వారికి, విడాకులు తీసుకున్న వారికి కూడా ఇది వర్తిస్తుందన్నారు. సెలవు కాలానికి జీతం వస్తుందని వెల్లడించారు. దత్తత తీసుకునే పిల్లల వయసు నెలరోజుల లోపు ఉంటే ఆ సెలవు ఏడాది పాటు, ఆరు నుంచి ఏడు నెలల మధ్య వారయితే ఆరు నెలలు సెలవు తీసుకునే అవకాశాన్ని కల్పించామని ఆయన తెలిపారు. పిల్లల సంరక్షణకు తీసుకునే సెలవు, తమ ఉద్యోగ కాలం మొత్తం మీద 180 రోజుల పాటు మహిళా ఉద్యోగులు తీసుకోవచ్చని పేర్కొంది. క్షయ, క్యాన్సర్, కుష్టు, కిడ్నీ వ్యాధులు వంటి అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి అసాధారణ సెలవు మంజూరు చేయడంతో పాటు ఆ సమయంలో ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను కూడా పెంచుతూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

రామగుండం మార్చి 9 పెద్దపల్లి జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులురామగుండం కోరుకంటి చందర్ ఆదేశాల మేరకు 8వ కాలనీలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సమావేశాల్లో 91,142 ఉద్యోగాలని ప్రవేశపెట్టి అందులో భాగంగా 80039 ఉద్యోగాల రిక్రూట్మెంట్ తక్షణమే నోటిఫికేషన్ జారీ చేసి 11,103 కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ టిఆర్ఎస్ పార్టీ మరియు అనుబంధ సంఘాలు టిఆర్ఎస్ వై పట్టణ కమిటీ, టిఆర్ఎస్వి, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో 8వ కాలనీలో, షిరికె బస్ స్టాండ్ చౌరస్తా వద్ద బాణసంచా కాల్చి, ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలభిషేకం చేయడం జరిగింది.టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మేడి సదానందం గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ కార్పొరేటర్లు సాగంటి శంకర్ భదావత్ శంకర్ నాయక్ బాదె అంజలి దేవి టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ ఎండి గౌస్ పాష ఎర్రవల్లి గోపాల్ రావు గుడెల్లి రామచందర్ దాసరి బాలరాజ్ పులి రాకేష్ సారయ్య నాయక్ కొత్తవాల రాజయ్య మారెల్లి మల్లారెడ్డి పోగుల వీరారెడ్డి నల్ల మధుకర్ రెడ్డి పోయిల సంపత్ కాటం రాజిరెడ్డి తమ్మనవేణి కుమార్ యాదవ్ కొమ్ము మనోజ్ వంశీ ముష్క శ్రీను మెంతుల శ్రీనివాస్ ఓదెలు ఉదయ్ చెన్నూరి మధు అంజి తెరాస పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మార్చిలో మండుతున్నఎండలు



హైదరాబాద్, మార్చి 9, (న్యూస్ పల్స్)తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే భానుడు నిప్పులు కక్కుతున్నాడు. ఉదయం తొమ్మిది గంటల నుంచే ఎండ ప్రభావం ప్రారంభమవుతోంది. దీంతో అడుగు బయటపెట్టాలంటేనే జనం వణికిపోతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మార్చి లోనే ఇలా ఉంటే.. రానున్న రోజుల్లో ఇంకెంత దారుణ పరిస్థితులు ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన అల్పపీడనం ప్రభావం తగ్గింది. దీంతో వేడి పెరిగింది. మధ్యాహ్నం ఉక్కపోత ఉంటోంది. ఉత్తర కోస్తాంధ్ర, యానాం ప్రాంతాల్లో వాయువ్య దిశ నుంచి బలమైన గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పగటి పూట ఎండ ఎక్కువగా ఉంటోంది. రాత్రివేళ కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం పెరుగుతున్నాయిరాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లో వాతావరణం పొడిగా మారింది. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు.. కర్నూలు జిల్లాలోనూ సూర్యుడు సుర్రుమంటున్నాడు. నంద్యాలలో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తెలంగాణలోని ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోనూ ఎండ వేడి ఎక్కువగా ఉంది. క్రమేపీ రాష్ట్ర వ్యాప్తంగా వాతావరణం పొడిగా మారుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దంటున్నారు

## యుటిఎఫ్ రాష్ట్ర 16 వ మహాసభలను జయప్రదం చేయండి

డోన్ మార్చి 9, :యూటీఫ్ 16 వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూటీఫ్ నాయకులు పిలుపునిచ్చారు,స్థానిక పట్టణంలో యూటీఫ్ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ ఈ నెల 12,13,14 తేదీలలో అనంతపురం పట్టణంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర 16 వ విద్యా వైజ్ఞానిక మహాసభలు జరుగుతున్నాయని కావున డోన్ డివిజన్ నుండి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై వాటిని జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్ ఎస్ బాబు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకట సుబ్బారెడ్డి,జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి,డోన్ మండల అధ్యక్షులు రామ మూర్తి,ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రెడ్డి,ప్యాపిలి మండల అధ్యక్షులు సర్వజ్ఞ మూర్తి,యుటిఎఫ్ జిల్లా సీనియర్ నాయకులు లక్మయ్య, మాణిక్యం శెట్టి,అబ్దుల్ లతీఫ్ పిలుపునిచ్చారు,స్థానిక యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయం నందు ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యారంగంలో ఊహించని పెనుమార్పులు వస్తున్నాయని,వాటిని నిశితంగా చర్చించి భవిష్యత్ విద్యారంగానికి దిశానిర్దేశం చేసేవిధంగా మహాసభలో చర్చిస్తామని,ఈ సమావేశాలకు గౌరవ పి డి ఎఫ్ ఎం ఎల్ సీ లు,మాజీ ఎమ్మెల్సీ లు,జాతీయ విద్యా వేత్తలు హాజరు కానున్నారని తెలిపారు, విద్యాశాఖ అధికారులు కూడా విద్యారంగంలో అనేక ప్రయోగాలు చేస్తున్నారని 3,4,5 తరగతుల విలీనం అందులో భాగమేనని వారు అన్నారు, అయితే చిన్నపిల్లలు మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి చదువుకోవడం చాలా కష్టమని వారు పేర్కొన్నారు,విద్యాశాఖలో 20 వేలు పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని వాటిని భర్తీ చేసి విద్యారంగాన్ని పరిపుష్టం చేయాలని వారు కోరారు,ఉపాధ్యాయుల,ఉద్యోగుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా నిరంకుశంగా పీఆర్సీ ని అమలు చేశారని,అధికారుల,పాలకుల నియంతృత్వ విధానాలకు ఇది పరాకాష్ట అని వారు అన్నారు

## ఏప్రిల్ 10 నుండి 18వ తేదీ వరకు ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు

### బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన జెఈఓ వీరబ్రహ్మం

తిరుపతి, మార్చి 09 ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, స్థల పరిశీలన, కల్యాణవేదిక వద్ద జరుగుతున్న పలు అభివృద్ధి పనులను జెఈవో వీరబ్రహ్మం బుధవారం పరిశీలించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఇంజినీరింగ్, ఆలయ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జెఈవో మీడియాతో మాట్లాడుతూ ఏప్రిల్ 10 నుండి 18వ తేదీ వరకు ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 15వ తేదీ రాత్రి 8 నుండి 10 గంటల వరకు సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 19న పుష్పయాగం జరుగతుందన్నారు. ఇందుకోసం చేపట్టవలసిన ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వేలాదిగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పారిశుద్ధ్య నిర్వహణ, షెడ్లు, తాగునీరు, అన్నప్రసాదాలపై పంపిణీపై అధికారులతో చర్చించినట్లు తెలిపారు. కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న అభివృద్ధి పనలును త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సివిఎస్వో గోపినాథ్ జెట్టి మాట్లాడుతూ స్వామివారి కల్యాణానికి వేలాదిగా వచ్చే భక్తులకు భద్రతా పరంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని టిటిడి విజిలెన్స్, పోలీస్ విభాగం వారితో సమన్వయం చేసుకొని పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. దర్శనం, అన్నప్రసాదాల పంపిణీ వద్ద తోపులాట లేకుండా బ్యారికేడ్లు, కల్యాణానికి వచ్చే భక్తులకు పార్కింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. అంతకుముందు జెఈవో, సివిఎస్వోతో కలిసి శ్రీ కోదండరామాలయం, ఆలయ పరిసరాలు, కల్యాణ వేదిక పరిశీలించి పలు సూచనలు చేశారు.

## వెదిర నుండి మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్సు ప్రారంభం

రామడుగు రామడుగు మండలం వెదిర గ్రామం నుండి మాడల్ స్కూల్ వరకు ఆర్టీసీ సౌకర్యం కల్పించాలని గత వారం రోజుల క్రితం బస్ భవన్ లో తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ గారికి గ్రామ వీడీసీ చైర్మన్ నాగుల రాజశేఖర్ గౌడ్ వినతి పత్రం అందజేశారు. దీనితో ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి బుధవారం గ్రామం నుండి మోడల్ స్కూల్ కు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి విద్యార్థులను తీసుకెళ్లారు. కాగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినందుకు గ్రామ సర్పంచ్ తీగల సంగీత ,ఉప సర్పంచ్ ఎడవెల్లి సత్యనారాయణ రెడ్డి ,వీడీసీ చైర్మన్ నాగుల రాజశేఖర్ గౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ తో పాటుగా ఆర్టీసీ అధికారులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు..

## దొంగల ముఠా అరెస్ట్

### రూ 3.65 లక్షలు విలువ చేసే బంగారూ నగలు మోటార్ వాహనాలు స్వాధీనం

### వివరాలు వెల్లడించిన మైదుకూరు డీఎస్పీ వంశీధర్ గౌడ్

బద్వేలు కడప ప్రకాశం నెల్లూరు జిల్లాలో అనేక దొంగతనాలకు పాల్పడిన దొంగల ముఠాను బుధవారం అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ 3.65 లక్షలు విలువచేసే బంగారు నగలు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు ఇందుకు సంబంధించిన వివరాలు మైదుకూరు డిఎస్పి వంశీధర్ గౌడ్ బద్వేలు అర్బన్ సీఐ రామచంద్ర విలేఖర్లకు తెలిపారు బద్వేలు మండలం ఆనంద నగర్ కు చెందిన అమ్మని ఓబులేసు ఇదే మండలం చెన్నంపల్లె మెట్ట ప్రాంతానికి చెందిన అక్కి దాసరి బాబు బద్వేలు మండలం కొత్తచెరువు గ్రామానికి చెందిన కొత్తచెరువు గ్రామానికి చెందిన అమ్మని కేశవ బ్రహ్మంగారి మఠం మండలం రేకలకుంట గ్రామానికి చెందిన హరీష్ అనే వ్యక్తులను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు వారి వద్ద నుండి 30 గ్రాములు బరువు గల బంగారు గొలుసు 10 గ్రాముల బరువు గల బంగారం గొలుసు తొమ్మిది గ్రాముల బరువు గల ఒక బంగారు నల్లపూసల దండ ముద్దాయిల కు చెందిన 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు చేసి వీటిని స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు కేసు దర్యాప్తులో బద్వేల్ అర్బన్ ఎస్ ఐ లు శ్రీకాంత్ కత్తి వెంకటరమణ అత్యంత ప్రతిభ చూపినట్లు వారు తెలిపారు ముద్దాయి అందరూ ఒక గ్రూపుగా ఏర్పడి నేరాలకు పాల్పడుతున్నారని ఎవరు చెప్పారు సులభంగా డబ్బు సంపాదించుకోవాలనే ఒకే ఒక ఆశయంతో వీరందరూ దొంగతనాలు చేస్తున్నట్లు చెప్పారు గత నెల 19వ తేదీ మధ్యాహ్నం బద్వేలు పట్టణం విద్యానగర్ లో నడుచుకుంటూ వెళ్తున్న ఒక మహిళ మెడలో బంగారు గొలుసులు లాక్కొని మోటార్ సైకిల్ పై వేగంగా వెళ్లినట్లు వారు తెలిపారు

## కల్లుగీత కార్మికుల ధర్నా...

విశాఖపట్నం మార్చి 9,కల్లుగీత కార్పొరేషన్ కు ఐదువేల కోట్లు నిధులు కేటాయించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఇందులో భాగంగా కల్లుగీత కార్మికులంతా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్ర దేవుడు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల కల్లు గీత కార్మికులు కష్టాలు పడుతున్నారని, వైసీపీ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు అయినప్పటికీ గీత కార్మికుల ఉపాధిపై కనీస ఆలోచన చేయడం లేదని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల్లో అన్ని వర్గాల కి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు గాని గీత కార్మికులకు ఎటువంటి పథకం అమలు జరగడం లేదని తెలిపారు. గీత కార్మికుల మధ్య సామాజిక వర్గాల పేరుతో తమల్ని విడదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లుగీత కార్మికులకు కొత్త పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎండి.రుహుల్లా

అమరావతి వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎండి.రుహుల్లా పేరు ఖరారయింది. బుధవారం నాడు అయన సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా బిఫామ్ అందుకున్నారు. దివంగత ఎమ్మెల్సీ కరీమున్నిసా తనయుడు రుహుల్లా. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, రుహుల్లా తండ్రి మహ్మద్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు

# కన్నుల పండుగగా శ్రీ రాఘవుని జన్మదిన వేడుకలు



-బృందావనానికి వెయ్యి లీటర్ల తో క్షీరాభిషేకం
-బృందావనానికి టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ
-స్వర్ణరథంపై ఊరేగిన రాఘవేంద్రుడు
-తమిళనాడుకు చెందిన 150మంది కళాకారులతో నాదహార కార్యక్రమం
-ముగిసిన గురు వైభవోత్సవాలు

మంత్రాలయం, మార్చి 9 (విభారేప్రతినిధి):- కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ శ్రీ నివాసుని వరపుత్రుడైన గురు సార్వభౌములు శ్రీ రాఘవేంద్ర స్వామి జన్మదిన వేడుకల మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. గురువైభవోత్సవాలలో భాగంగా 401 వ, పట్టాభిషేక మహోత్సవం పురస్కరించుకుని, బుధవారం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో శ్రీ రాఘవేంద్రుని 427వ, జన్మదిన వేడుకలు సందర్భంగా, మూల బృందావనానికి విశేష క్షీరాభి షేకం, ఫల పుష్పాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేసి, స్వర్ణ, పుష్పాలతో అలంకరించారు. భక్తులు ముందుగా పార్వతీ రూపినీ అయిన శ్రీ మంచాలమ్మను దర్శించుకుని,ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.స్వర్ణ రథంపై శ్రీగురువును అధిష్టించి, మఠం ప్రాకారంలో అశేష భక్త జన హర్షధ్వనుల మధ్య ఘనంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పతి అవార్డు గ్రహీత, పండిత కేసరి, రాజా ఎస్ గిరియాచార్యులు, ఓఎస్ డి ఎస్కె శ్రీనివాస్ రావు, ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ వెంకటేష్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీ పతి ఆచార్, సహాయ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి, ద్వార పాలక అనంతాచార్, విద్వాన్ వాదిరాజాచార్, ఇంజనీర్ సురేష్ కోనాపూర్, ధార్మిక సిబ్బంది వన్నొళ్లి వ్యాసరాజాచార్, బిందుమాధవాచార్, కుర్ది జయతీర్థాచార్,జే ప్రహ్లాద తదితర మఠం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులు



ఆత్మకూరు. మార్చి 9,(విభారేప్రతినిధి)ఆత్మకూరు పట్టణంలో బహుజన సమాజ్ వాది పార్టీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు..ఆ పార్టీఆత్మకూరు నియోజకవర్గ అధ్యక్షులు ఆత్మకూరు పట్టణ న్యాయవాది నందా ఓబులేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బి. పరంజ్యోతి మరియు జిల్లా పార్టీ నాయకులు స్థానిక కార్యకర్తలు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రజలతో సంబంధాలు కొనసాగించాలని అలాగే నియోజకవర్గంలో జరిగే ప్రతి ఎన్నికలలో తమ పార్టీ నుండి అభ్యర్థులు పోటీ చేసేలా నాయకులు కార్యకర్తలు సిద్ధమవ్వాలని ఈ సందర్భంగా వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుండి భారీగా కార్యకర్తలు హాజరయ్యారు.. ఈ శిక్షణా తరగతులలో ఎన్నికల సమయంలో చేయవలసిన వ్యూహరచనను కార్యకర్తలు పాటించవలసిన నియమ నిబంధనలు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు వివరించారు. ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి గౌతం రెడ్డి మృతితో త్వరలో ఇక్కడ ఎన్నికలు రానున్న దృష్ట్యా బి ఎస్ పి పార్టీ నిర్వహించిన ఈ శిక్షణ తరగతులు ప్రత్యేకత చోటుచేసుకున్నాయి..

## ద్రోణాచలం సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

డోన్ మార్చి 9,(విభారేప్రతినిధి) ద్రోణాచాలం సేవసమితి ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు, స్థానికి డోన్ పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ యందు ద్రోణాచలం సేవా సైనికుడు పానిపూరి మురళి పుత్రులు (కవలలు) నందు- చందు ల పుట్టినరోజు సందర్భంగా ఆర్భాటాలకు వెళ్లకుండా నలుగురి ఆకలి తీర్చాలని ఉద్దేశంతో వారిచేత డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే అన్నార్తులకు సుమారు 150 మందికి అన్నదానం చేయించారు. ఈ కార్యక్రమంలో పిల్లలతో పాటు షాదిఖాన రాజా, పానీపూరి మురళి, తాహెర్ భాష,ఆటో హరి లు పాల్గొన్నారు.



# హాకీ అభివృద్ధికి సహకరిస్తా

## వైఎస్ఆర్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్

కర్నూలు స్పోర్ట్స్ న్యూస్ (విభారె ప్రతినిధి):- హాకీ కర్నూల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్ జూనియర్ బాలికల జిల్లా స్థాయి ఎంపిక పోటీలను జడ్పీ హైస్కూల్ గార్గేయపురం లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైఎస్ఆర్ జూఖీ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ హాకీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, తాను కూడా పాఠశాల పూర్వపు విద్యార్థినని, హాకీ క్రీడలో రాష్ట్ర స్థాయి పోటీలలో ఆడానని, హాకీ మాకు నేర్పించిన గురువు వెంకటేశ్వర్లు ఫిజికల్ డైరెక్టర్ అని, క్రీడాకారులకు 10000 రూపాయలు విరాళం ప్రకటించారు.క్రీడాకారులు మంచిగా రాణించి జిల్లాకు పేరు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హాకీ కార్యదర్శి దాసరి సుధీర్ మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 15 వరకు జరిగే 12వ హాకీ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ బాలికల అంతర్ జిల్లా పోటీలు నెల్లూరులో కనపర్తి పాడులో జరుగుతాయని, కర్నూలు జిల్లా పాల్గొంటుందని తెలిపారు అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీ వెంకట రాముడు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో గర్జియపురం క్రీడాకారులు జిల్లాస్థాయి రాష్ట్రస్థాయి పోటీలలో రాణిస్తున్నారనితెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఏసోపు, హాకీ కర్నూల్ కోశాధికారి వెంకటేశ్వర్లు ,సురేష్ పాఠశాల ఉపాధ్యాయులు భాస్కర్ మొదలగు వారు పాల్గొన్నారు. చివరగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిబ్బంది ప్రశాంత్ ను సన్మానించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు.



# విద్యుత్ మీటర్లు బిగిస్తే రైతులకు ఉరితాళ్లు వేసినట్లే

## రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఎవి సుబ్బారెడ్డి



నంద్యాల మార్చి 9,(విభారేప్రతినిధి)::- నంద్యాల పట్టణంలో బుధవారం నాడు ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి రైతులకు ఉరితాళ్లు సిద్ధం చేస్తున్నారని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ సీనియర్ టిడిపి నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడు సంవత్సరాలలో రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర కొనుగోలు కేంద్రాలు లేక నష్టాలతో రైతులు అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారాని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన పెట్టుబడి, ఎరువుల ధరలు కూలీల ఖర్చులు పెరగడంతో రైతులు పూర్తిగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గోరుచుట్టుపై రోకలిపోటు అన్నట్లు వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు బిగించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేయడం రైతులను మోసం చేయడమేనని పేర్కొన్నారు . ప్రక్క రాష్ట్రమైన తెలంగాణలో సీఎం కేసీఆర్ విద్యుత్ వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు బిగించే పరిస్థితి లేదని ఎంత ఖర్చైనా భరిస్తామని చెప్పడం జరిగిందన్నారు. కనీసం తెలంగాణ ప్రభుత్వం ను చూసి సీఎం జగన్ తెలుసుకోవాలని అన్నారు . రైతు ప్రభుత్వం గా చెప్పుకొనే వైసీపీ ప్రభుత్వం రైతులను దివాలా తీసే విధంగా వ్యవహరిస్తున్నదని రైతుల కోసం ఏర్పాటుచేసిన రైతు రైతు భరోసా కేంద్రాలు వైసీపీ నాయకులు షెల్టర్ గ మార్చుకున్నారని రైతులకు ఏమాత్రం ఉపయోగపడడం లేదని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతులు పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధర ఉందో ప్రభుత్వం చెప్పాలని,గత మూడు సంవత్సరాలుగా రైతులకు పెట్టుబడి కూడా రాని పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులను వడ్డీ వేధింపులను భరించలేక వందలాది మంది రైతులు ఉరివేసుకొని ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ఎరువుల ధరలు కూలీల ఖర్చులు అధిక వర్షాలతో తెగుళ్ళకు పంట దిగుబడి తగ్గడం సరైన మద్దతు ధర లేకపోవడం ప్రభుత్వం పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వంటి వాటితో రైతులు అప్పుల ఊబిలో ఇరుకున్నారని ,ఇది రైతు ప్రభుత్వం కాదు రైతులకు శాపంగా మారిందనిపేర్కొన్నారు.

# ల్యాండ్ కన్వర్షన్ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలన

## నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

నంద్యాలమార్చి 9 (విభారేప్రతినిధి) :- కొలిమిగుండ్ల మండలం లో దాదాపు అరవై ఎనిమిది ఎకరాల ల్యాండ్ కన్వర్షన్ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందని నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. బుధవారం కొలిమిగుండ్ల మండలం లోని ల్యాండ్ కన్వర్షన్ భూములను నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్. కొలిమిగుండ్ల తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది. కొలిమిగుండ్ల మండల కేంద్రంలో దాదాపు ఏడు ఎకరాలు. కల్వటాల గ్రామ పొలిమేరలో రాంకో సిమెంట్ వారికి సంబంధించి 51 ఎకరా. రైతులకు సంబంధించి మూడున్నర ఎకరా. ఇటిక్యాల గ్రామము నందు మూడున్నర ఎకరా. రాఘవరాజు పల్లె యందు దాదాపు మూడు ఎకరాల భూములను ల్యాండ్ కన్వర్షన్ కొరకు పరిశీలించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొలిమిగుండ్ల మండల సర్వేయరు. మండల ఆర్ ఐ తదితరులు పాల్గొన్నారు.



# మూడేళ్ల తర్వాత సూపర్ స్టార్ రికార్డ్ బ్రేక్




మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ నటించిన 'లూసీఫర్' సినిమా 2019 సంవత్సరంలో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో మలయాళ సినీ ఇండస్ట్రీలో అప్పటి వరకు ఏ సినిమా దక్కించుకోని అత్యధిక వసూళ్లను దక్కించుకుంది. ఆ సినిమా రికార్డును బ్రేక్ చేయడం ఇప్పటి వరకు ఏ హీరోకు కూడా సాధ్యం కాలేదు అనుకుంటున్న సమయంలో మలయాళ మెగాస్టార్ ఆ రికార్డును బ్రేక్ చేశాడు.మెగాస్టార్ మమ్ముట్టీ హీరోగా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన భీష్మ పర్వం అనే సినిమా తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమా కు పాజిటివ్ రెస్పాన్స్ దక్కింది. రివ్యూలు కూడా చాలా పాజిటివ్ గా రావడంతో సినిమా ను భారీ ఎత్తున చూసేందుకు జనాలు థియేటర్ల వద్ద క్యూ కట్టారు. గత రెండేళ్ల తర్వాత భారీ వసూళ్లు దక్కించుకున్న సినిమా గా కూడా భీష్మ పర్వం సినిమా నిలిచింది.గ్యాంగ్ స్టర్ కథ తో రూపొందిన ఈ సినిమా లో మమ్ముట్టీని అద్బుతంగా ప్రజెంట్ చేయడం లో దర్శకుడు పూర్తిగా సఫలం అయ్యాడు. ఆయన నుండి వరుసగా సినిమాలు వస్తున్నా కూడా అవి ఫ్లాప్ అవుతున్న ఈ సమయంలో గ్యాంగ్ స్టర్ గా భీష్మ పర్వం లో చూపించి అభిమానులకు కన్నుల పండుగగా సినిమాను మార్చాడు అంటూ మలయాళ ఇండస్ట్రీ వర్గాల వారు మరియు విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.లూసీఫర్ సినిమా ఒక సంచలనంగా ఇన్నాళ్లు కొనసాగుతూ వచ్చింది. ఎట్టకేలకు ఆ సినిమా బాక్సాఫీస్ నెం.1 రికార్డు చేజారింది. లూసీఫర్ లాంగ్ రన్ వసూళ్లను ఇప్పటికే వసూళ్లు చేసిన భీష్మ పర్వం రాబట్టిందనే టాక్ వినిపిస్తుంది. మొదటి వారం రోజుల్లో ఇప్పటివరకు ఏ మలయాళ మూవీ సాధించని వసూళ్లు సాధించడంతో మమ్ముట్టీ అభిమానులు ఫుల్ హ్యాపీగా ఉన్నారు.తెలుగు లో మెగాస్టార్ మమ్ముట్టీ కీలక పాత్రలో త్వరలోనే ఒక సినిమా తో రాబోతున్నాడు. ఆ సినిమాకు సంబంధించిన చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. చాలా కాలం గా తెలుగు లో సినిమాల ఆఫర్లు వస్తున్నా కూడా కాదంటూ వస్తున్న ఈయన యాత్ర సినిమా తో ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత కూడా కొన్ని సినిమాలకు మమ్ముక్క నో చెప్పడం జరిగింది. కాని ఇప్పుడు మాత్రం ఆయన టాలీవుడ్ ప్రేక్షకులను బ్యాక్ టు బ్యాక్ మోహన్ లాల్ మాదిరిగా ఎంటర్ టైన్ చేసేందుకు సిద్ధం అయ్యాడు.


# సోఫాలో చందమామ..సో కూల్ !



ప్రస్తుతం చందమామ కాజల్ అగర్వాల్ నిండు గర్భిణి. త్వరలో పండంటి బిడ్డకి జన్మనిచ్చి మాతృమూర్తి కాబోతుంది. టైమ్ టై టైమ్ ట్రెయినర్ సమక్షంలో చిన్న పాటి ఎక్సర్ సైజులు...డైట్ తీసుకుంటూ ఇంట్లోనే కాలక్షేపం చేస్తోంది. వాటికి సంబంధించిన ఫోటోలు ..వీడియోలు అభిమానులకు షేర్ చేస్తూ కుటుంబ సభ్యులతోనే ఉంటుంది. అప్పుడప్పుడు కొన్ని ఇంట్రెస్టింగ్ ఫోటోల్ని సైతం ఇన్ స్టాలో షేర్ చేస్తుంది. తాజాగా మరో కొత్త ఫోటోని షేర్ చేసింది.శరీరం మొత్తం కంపర్ట్ గా ఉండే క్యాజువల్ తెలుపు దుస్తులు ధరించి చందమామ ఇలా మోచేతులపై బ్యాలెన్స్ చేస్తూ పక్కకు పడుకుని కెమెరాకి ఫోజులిచ్చింది. కాళ్లకి పింక్ కలర్ హై హీల్స్ ధరించింది. మొత్తం ఫోటోలో హైహీల్స్ జిగేల్ మంటున్నాయి. 'సండే మూడ్' అంటూ ఓ క్యాప్షన్ ఇచ్చి ఇలా ఆదివారం రోజున దిగిన ఫోటోని రివీల్ చేసింది. ఈ ఫోటో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. ఇటీవలే ఫేస్ మ్యాగజైన్ కవర్ పేజీ కోసం కాజల్ భర్త గౌతమ్ కిచ్లూతో కలిసి జంటగా ఫోజులిచ్చిన సంగతి తెలిసిందే. గర్భిణిగా ఉండి భర్తతో కలిసి కెమెరాకి ఫోజులిచ్చిన అతికొద్ది జంటల్లో కాజల్ పెయిర్ ఒకటి కావడం విశేషం.ఇక కాజల్ సినిమాల విషయానికి వస్తే తమిళ్..తెలుగు..హిందీ అంటూ మూడు భాషల్ని చుట్టేస్తోంది. కోలీవుడ్ లో ఎక్కువ సినిమాలు చేస్తోంది. కొన్ని సినిమాలు షూటింగ్ పూర్తయ్యాయి. తెలుగులో మెగాస్టార్ చిరంజీవి సరసన 'ఆచార్య' నటిస్తోంది. చిరంజీవితో కలిసి నటించడం ఇది రెండవ సారి. గతంలో 'ఖైదీ నెంబర్ 150' లో మెగాస్టార్ కి జోడీగా నటించిన సంగతి తెలిసిందే. ఆ సినిమా పెద్ద హిట్ అయింది. అదే సెంటిమెంట్ తో కొరటాల శివ మరోసారి కాజల్ ని చిరు సరసన 'ఆచార్య'లో రిపీట్ చేసారు. 'ఇండియన్ -2' లో విశ్వ నటుడు కమల్ హాసన సరసన నటిస్తోంది.

# ఇప్పటికైనా మనోళ్లు ఈ అమ్మడిని గుర్తిస్తారా?

చెన్నై ముద్దుగుమ్మ ప్రియాంక అరుల్ మోహన్ ప్రస్తుతం కోలీవుడ్ లో మంచి జోష్ తో దూసుకు పోతుంది. తెలుగు లో ఈమె నాని గ్యాంగ్ లీడర్ మరియు శ్రీకారం సినిమాల్లో నటించింది. రెండు కూడా ఫీల్ గుడ్ మూవీస్ గా పేరు దక్కించుకున్నాయి. నాని గ్యాంగ్ లీడర్ కమర్షియల్ గా మంచి పేరును దక్కించుకోగా శ్రీకారం సినిమా మాత్రం విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. రెండు సినిమాల్లో కూడా చాలా క్యూట్ లుక్ లో ఈమె కనిపించింది.హీరోయిన్ గా ప్రియాంక అరుల్ మోహన్ కు శ్రీకారం తర్వాత తెలుగు లో ఇప్పటి వరకు అవకాశాలు రాలేదు. తెలుగు లో ఈ అమ్మడికి మంచి గుర్తింపు వచ్చినా కూడా ఇండస్ట్రీ వర్గాల వారు మాత్రం ఈమెను హీరోయిన్ గా తమ సినిమాల్లో ముఖ్యంగా స్టార్ హీరోలు తమ సినిమా ల్లో నటింపజేసేందుకు ఆసక్తి చూపడం లేదు. తెలుగు లో అవకాశాలు రానప్పటికి తమిళంలో మాత్రం ఈమెకు మంచి ఆఫర్లు బ్యాక్ టు బ్యాక్ వస్తున్నాయి.తాజాగా ఈమె తమిళ స్టార్ హీరో సూర్య తో కలిసి 'ఈటీ' సినిమా లో నటించింది. సూర్య అభిమానులతో పాటు ప్రతి ఒక్కరు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ టీ సినిమా లో ప్రియాంక అరుల్ మోహన్ లుక్ ఇప్పటికే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తన గత సినిమాల మాదిరిగానే ఈ సినిమాలో కూడా అత్యంత అందంగా.. క్యూట్ గా సూర్య కు జోడీగా కనిపిస్తుంది అంటూ జనాలు పోస్టర్ లను చూసే అనేస్తున్నారు.మార్చి 10వ తారీకున తమిళం మరియు తెలుగు లో ఒకే సారి విడుదల కాబోతున్న ఈటీ సినిమా తో ప్రియాంక ఖచ్చితంగా స్టార్ డమ్ ను దక్కించుకుంటుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది. సూర్య కు జోడీగా నటించడం వల్ల తెలుగు లో కూడా ఈమె మరింత గా టాలీవుడ్ ప్రేక్షకులకు చేరువ అయ్యే అవకాశం ఉంది అంటూ ఇండస్ట్రీ వర్గాల వరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ప్రియాంక అరుల్ మోహన్ తెలుగు లో ఈటీ ద్వారా మరోసారి రాబోతున్న నేపథ్యంలో ఈసారి అయినా మనోళ్లు ఆమె అందంను మరియు ప్రతిభను గుర్తించి అవకాశాలు ఇస్తారేమో చూడాలి. అందాల ఆరబోత విషయంలో కాస్త దూరం ఉండే ప్రియాంక అరుల్ మోహన్ ను తెలుగు ఫిల్మ్ మేకర్స్ దూరం పెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.తెలుగు ఫిల్మ్ మేకర్స్ కు హాట్ గా అందాలు ఆరబోసే వారే కావాలా ప్రియాంక అరుల్ మోహన్ వంటి క్యూట్ లుక్ ముద్దుగుమ్మలు వద్దా అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు.



# నెట్ బౌలర్ జన్మదిన వేడుకలను దగ్గరుండి జరిపించిన ధోని



ఐపీఎల్ 2022 సన్నాహకాల్లో భాగంగా సూరత్‌లోని ప్రాక్టీస్ క్యాంప్‌లో

బిజీబిజీగా గడుపుతున్న చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు.. ఇవాళ (బుధవారం) ఫ్రాంచైజీ నెట్ బౌలర్ రాకీ బర్త్‌డే సెలబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకలను జట్టు కెప్టెన్ ఎంఎస్ ధోని దగ్గరుండి జరిపించాడు. నెట్ బౌలరే కదా అని చిన్నచూపు చూడకుండా ధోని దగ్గరుండి రాకీతో కేక్ కట్ చేయించి, తినిపించి హడావుడి చేశాడు. దీనికి సంబంధించిన వీడియోను సీఎస్‌కే ఫ్యాన్స్ ఆర్మీ సోషల్‌మీడియాలో పోస్ట్ చేయగా ప్రస్తుతం వైరలవుతోంది. ఈ వీడియోలో ధోని కలుపుగోలుతనాన్ని చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. ఇందుకే ధోని భాయ్ ప్రతి ఒక్కరి మనసులను గెలుచుకుంటాడంటూ కామెంట్లు చేస్తున్నారు. సాధారణ నెట్ బౌలర్ బర్త్ డే వేడుకలను ఇలా ఘనంగా నిర్వహించడంపై సీఎస్‌కే యాజమాన్యంపై కూడా నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ వేడుకల్లో సీఎస్‌కే సీనియర్ ఆటగాడు అంబటి రాయుడు కూడా పాల్గొన్నాడు.

# న్యూజిలాండ్‌తో భారత్ పోరు.. వాళ్లదే పైచేయి.. అయితేనేం!

ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్-2022 ఎనిమిదో మ్యాచ్‌లో భాగంగా భారత జట్టు ఆతిథ్య న్యూజిలాండ్‌తో గురువారం తలపడనుంది. సెడాన్ పార్కు వేదికగా జరిగే మ్యాచ్‌లో వైట్ ఫెర్న్స్‌తో మిథాలీ సేన అమీతుమీ తేల్చుకోనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ఇరు జట్లు వన్డేల్లో ఎన్నిసార్లు పోటీపడ్డాయి? ప్రపంచకప్ చరిత్రలో ఎవరిది పైచేయి అన్న వివరాలు పరిశీలిద్దాం.అంతర్జాతీయ స్థాయిలో భారత మహిళా జట్టు న్యూజిలాండ్‌తో ఇప్పటి వరకు 53 వన్డేలు ఆడింది. ఇందులో వైట్ ఫెర్న్స్ 32 విజయాలు సాధించగా... భారత్ ఇరవైంట మాత్రమే గెలుపొందింది. ఒక మ్యాచ్ టైగా ముగిసింది.ప్రపంచకప్ చరిత్రలోనూ భారత్‌పై న్యూజిలాండ్ జట్టుదే పైచేయి. ఇప్పటి వరకు ఈ ఐసీసీ మెగా ఈవెంట్‌లో ఇరు జట్లు తొమ్మిదిసార్లు ముఖాముఖి తలపడ్డాయి. ఇందులో తొమ్మిదింట వైట్ ఫెర్న్స్ జయకేతనం ఎగురవేయగా.. భారత్ కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే గెలిచింది.భారత మహిళా జట్టు వన్డే కెప్టెన్ మిథాలీ రాజ్‌కు న్యూజిలాండ్‌పై మంచి రికార్డు ఉంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**